


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 138 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 గురువారం 07 ఆగస్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్






## 42శాతం రిజర్వేషన్లు ఇస్తారా..

# గద్దె దింపాలా?

## బిసి రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష

- తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంది?
- మోడీపై నేరుగా విమర్శలు గుప్పించిన సిఎం రేవంత్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాల ఉద్వేగ పూరిత ప్రసంగం
- బిజెపి, బిఆర్ఎస్ తీరును తూర్పారా పట్టిన రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే.. ప్రధాని మోడీని గద్దెదించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని.. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులకు ఆమోదం తెలకపపోతే ప్రధాని మోడీని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ చెప్పినా మోడీ ప్రధాని పదవి వదులుకోవడం లేదని.. 75 ఏళ్ల నిబంధన ఆయనకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ గద్దె దిగినా.. దిగకపోయినా.. 2029లో మేమే ఆయనను గద్దె దింపి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుంటామని..ఇదే మా శపథమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ–పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు.

## ప్రధాని మోడీ చైనా పర్యటన ఖరారు

### ఆగస్టు 31 నుంచి రెండ్రోజుల పర్యటన

న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చైనా పర్యటన ఖరారైంది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకూ.. రెండు రోజుల పాటూ చైనాలో ప్రధాని పర్యటించనున్నారు. అక్కడ టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఇక చైనా పర్యటన అనంతరం ప్రధాని మోదీ జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. 2019 గాల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనా పర్యటకు వెళ్తుండటం ఇదే తొలిసారి. మరోవైపు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదనపు సుంకాల వేళ మోదీ చైనా పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఉత్తరాఖండ్ వరదల్లో 28మంది కేరళ పర్యాటకుల గల్లంతు

డెహ్రాడూన్,ఆగస్ట్6(సమయజ్యోతి):

ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలోని ధరాలి, సుఖీ అనే గ్రామాలను వరదలు ముంచెత్తాయి. భారీ వర్షం కారణంగా మెరుపు వరద ధరాలి గ్రామాన్ని సగం తుడిచిపెట్టేసిసింది. కళ్లముందే ఇళ్లు, వాహనాలు కొట్టు–కుపోయాయి. ప్రాణాలు రక్షించుకునేందుకు పరుగెత్తుతున్న వారిని వరద రాకాసిలా ముంచెత్తింది.

2లో

## గాంధీ కుటుంబాన్ని పొగడడానికే

# బిసి ధర్నా

### సోనియా, రాహుల్ జపంలో తరించిన రేవంత్

### జంతర్‌మంతర్ ధర్నాపై కిషన్ రెడ్డి ఎద్దేవా



న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు

2లో

## కర్తవ్యభవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

ఢిల్లీ, ఆగస్టు 6(సమయజ్యోతి):



దేశ రాజధాని ఢిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రకటించింది. వాటిలో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. సీసీఎస్–3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్‌లోకి కేంద్ర హెూంశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, పెట్రోలియం శాఖలతోపాటు ప్రధానమంత్రికి ముఖ్య శాస్త్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయాలు తరలివెళ్లనున్నాయి. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే. ప్రస్తుతం శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే నూతన భవనాల్లోకి క్రమంగా మారిపోతాయి. అన్ని కార్యాలయాలు కొత్త భవనాల్లోకి మారిన తర్వాత పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలువనున్నట్లు సమాచారం.

## బిసి బిల్లును వెంటనే ఆమోదించాలి

### మహాధర్నాలో డిప్యూటీ సిఎం భట్టి డిమాండ్




న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

బీసీ బిల్లుకు రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలపాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు జరిగితే.. దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు.

## ప్రజలను భ్రమ పెట్టేందుకే

# ఢిల్లీలో ధర్నాలు

### కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్,ఆగస్టు6(సమయజ్యోతి):

బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింలు ఉండవద్దని ముందు నుంచి బండి సంజయ్ మాట్లాడుతునే ఉన్నారని చెప్పుకొచ్చారు.




## ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న వరదలు

### చిక్కుకుపోయిన యాత్రికులు

ఢిల్లీ, ఆగస్టు 6(సమయజ్యోతి):

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఆకస్మిక వరదలు చుట్టు ముడుతున్నాయి. ఉత్తరకాశీ జిల్లాలో జలవిలయం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి.

02

## బసి బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే

# గొప్ప ముందడుగు

### -ఎక్స్ వేదికగా రాహుల్ వెల్లడి



న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు. కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసమే కాదు.. దేశంలోని అణగారిన వర్గాలందరి కోసం. ఈ ధర్నాకు హాజరైన ఇండియా కూటమి నేతలకు ధన్యవాదాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## బీసీలపై కాంగ్రెది

# దొంగ ప్రేమ

### 50ఏళ్ల పాలనలో బీసీలకు ఎనలేని నష్టం : బండిసంజయ్

హైదరాబాద్, ఆగస్టు6(సమయజ్యోతి):

50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీలను పట్టించుకున్న దాఖలాలు ఉన్నాయా?.. సీఎంను చేసిన లెక్కలు ఉన్నాయా ఉంటే చెప్పాలని కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని ఆరోపణలు చేశారు. ఇది కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదని.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనేనని విమర్శలు చేశారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



2లో.

మొదటిపేజీ తరువాయి

# ఉత్తరాఖండ్ వరదల్లో 28మంది కేరళ పర్యాటకుల గల్లంతు

దీంతో పదుల సంఖ్యలో జనాలు బురదలో కూరుకుపోయారు. ఇండ్లు, హోటళ్లను బురద ముంచెత్తింది. దాదాపు 25 హోటళ్లు కొట్టుకుపోయాయి. వరద కారణంగా ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు- అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో కేరళకు చెందిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతు అయినట్లు- తెలుస్తోంది. ఉత్తరకాశి నుండి గంగోత్రికి బయలుదేరుతున్న సమయంలో వారు చివరిసారిగా తమతో మాట్లాడారని.. ఇప్పుడు వారి ఫోన్లు పనిచేయడం లేదని పర్యాటకుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంఘటనాస్థలంలో ప్రస్తుతం భారత సైన్యం, సహాయక బృందాల నేతృత్వంలో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. భారీ వరదలతో కొట్టు-కుపోయిన రోడ్లు, కూలిపోయిన వంతెనల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ధరాలి నుండి ఇప్పటివరకు 130 మందికి పైగా ప్రజలను రక్షించారు. అయితే, కేరళ పర్యాటక బృందం ఆచూకీ ఇంకా తెలియలేదు.

మొదటిపేజీ తరువాయి

# బిసి బిల్లును వెంటనే ఆమోదించాలి

బిల్లు ఆమోదం కోసం నినాదాలు చేస్తూ.. జంతర్ మంతర్ వద్ద బైఠాయించారు.ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేయగలరా.. అని ప్రశ్నించిన ప్రతిపక్షాలకు కులగణన చేసి చూపెట్టారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఆదేశాలతో సైంటిఫిక్‌గా సర్వే చేసినట్లు- చెప్పుకొచ్చారు. బిల్లు అమలు అయితే.. 42 శాతం విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఆమోదం తెలుపాల్సిందే అని డిమాండ్ చేశారు. ఈ బిల్లుతో ఓబీసీల కల నెరవేరాలని ఆకాంక్షిస్తున్నట్లు- భట్టి చెప్పారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భట్టి మండిపడ్డారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు జరగకుండా.. బీజేపీ నాయకులు అడ్డుకుంటు-న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని భట్టి విమర్శించారు.

# బీసీలపై కాంగ్రెది దొంగ ప్రేమ

మొదటిపేజీ తరువాయి

బుధవారం ఢిల్లీ వేదికగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీ ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని క్లారిటీ ఇచ్చారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు బండి సంజయ్. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? అని నిలదీశారు. తెలంగాణ కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా? అని సవాల్ విసిరారు. లోక్‌సభ సభ్యుల్లో ఎంతమంది బీసీలకు సీట్లిచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీనా బీసీల గురించి తమకు నీతులు చెప్పేది? అని నిలదీశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనని ఉద్ఘాటించారు బండి సంజయ్. 27మంది బీసీ కేంద్రమంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీదేనని బండి సంజయ్ కేంద్రంపై నెపం మోసిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కాంగ్రెస్ నేతలు తప్పుకోవాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ కనుమరుగవడం తథ్యమని బండి సంజయ్ హెచ్చరించారు. ఈరోజు న్యూఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోందే తప్పా బీసీల కోసం కానేకాదని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. మైనార్టీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. బీసీలను ఘోరంగా మోసం చేస్తోంది. అందుకే కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని బండి సంజయ్ ఆక్షేపించారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు

బీజేపీ బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతి ఒక్క పార్టీతో జై తెలంగాణ అనిపించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీసీల కోసం తాము హైదరాబాద్‌లో 72గంటల పాటు దీక్ష చేశామని ఉద్ఘాటించారు. కోర్టు నుంచి తమకు పర్మిషన్ రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేయడం కాదని, నిజమైన దీక్షలు చేయాలని హితవు పలికారు ఎమ్మెల్సీ కవిత. జాగృతిలోకి వచ్చేందుకు చాలామంది రెడీగా ఉన్నారని.. తమకు అన్నివర్గాల మద్దతు వస్తోందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీల కోసం కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు చిత్తశుద్ధితో పని చేయటం లేదని మండిపడ్డారు. బీసీల కోసం జాగృతి కార్యచరణ సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లపై బండి సంజయ్ మాట్లాడకపోతేనే విచిత్రమని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, అన్ని పార్టీల నాయకులకు లేఖలు రాయాలని సూచించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకొని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాలనీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా, వారి బాటలో తెలంగాణ జాగృతి ముందుకు వెళ్లిందని ఉద్ఘాటించారు. జయశంకర్ సార్ ఆలోచనలను తూచా తప్పకుండా పాటించామని చెప్పుకొచ్చారు. తెలంగాణ చూడకుండానే జయ శంకర్ సార్ దూరం అయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జయ శంకర్ సార్ జయంతి సందర్భంగా జాగృతి ఫౌండేషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలని జయశంకర్ సార్ అనేక సార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలని జయశంకర్ సార్ చెప్పే వారని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# 42శాతం రిజర్వేషన్లు ఇస్తారా.. గద్దె దింపాలా?

ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు. 50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టాం అని అన్నారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు మాత్రమే ఉంటుంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తే దేశ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు ఇస్తున్నారు. అదే విధంగా ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్ధతు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పార్లమెంటులో మోదీ సర్కార్?తో కొట్లాడుతామని ధర్నాకు వచ్చి అండగా నిలిచారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసి దేశానికి రాహుల్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని అంటూ, ఆ హామీ మేరకు 42శాతం చట్టం చేశామని అన్నారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం మేము చేశాం. కేబినెట్ మంత్రులు నాకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేసే అవకాశం నాకు కల్పించారు. దేశానికే ఆదర్శంగా నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని అందిపుచ్చుకుని.. జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు. దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా?మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది?తెలంగాణలో మీరు బలహీన వర్గాలను ఓట్లు అడగలేదా?ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా?పేరు బంధం తెగిన తెరాస పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి.

మొదటిపేజీ తరువాయి

# కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట

హైదరాబాద్, ఆగస్టు 6(సమయజ్యోతి):

కేంద్రం హోం మంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వాఖ్యలు చేశారనే కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు జారా?ండ్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ స్వయంగా చాయిబాసా కోర్టు ముందు బుధవారంనాడు హాజరయ్యారు. దీనికి ముందు, రాహుల్ గాంధీ కోర్టుకు హాజరవుతున్న నేపథ్యంలో కోర్టు చుట్టూ భద్రతను పెంచారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. రాంచీ నుంచి చాయిబాసాకు రాహుల్ హెలికాప్టర్‌లో వచ్చారు. ఇందుకోసం టాటా కాలేజీ గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రాహుల్ మంగళవారంనాడు రాష్ట్రానికి వచ్చారు. రాహుల్ గాంధీ 2018లో జరిగిన ఒక ర్యాలీలో అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి పరువునష్టం కేసు వేశారు. జూన్ 26న ప్రత్యేక కోర్టు ముందు రాహుల్ హాజరు కావాల్సి ఉండగా ఆయన తరఫు న్యాయవాది తన క్లయింట్ ఆరోజు హాజరుకాలేరని, ఆగస్టు 6వ తేదీని హాజరయ్యేందుకు వీలు కల్పించాలని కోర్టును కోరారు.

# కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మాడల్

**42శాతం రిజర్వేషన్లలో వారికి అండగా నిలబడ్డాం**

**బిసి కోటా బిల్లును తొక్కిపెట్టిన మోడీ ప్రభుత్వం**

**ఢిల్లీ మహాధర్నాలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదించామని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. కులగణన చేసి దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీ కోటా బిల్లులను ప్రధాని మోడీ నాలుగు నెలలుగా తొక్కిపెట్టారని విమర్శించారు. బీసీ కోటా బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని ప్రధాని మోడీ భయమని ఎద్దేవా చేశారు.ఢిల్లీలో టీ-పీసీసీ చేపట్టిన బీసీ మహాధర్నా చూసైనా కేంద్రంలోని మోడీ సర్కార్ కు కనువిప్పు కలగాలని..మోడీ తల్చుకుంటే సాయంత్రాని కే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కోటా బిల్లు తేవటం చారిత్రాత్మకమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్న మొనగాడు సీఎం రేవంత్ రెడ్డి అని.. ఆయన చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. బీసీ కోటా బిల్లుతో మోడీ పరేషాన్లో ఉన్నారని అన్నారు. ఇన్నాళ్లు బీసీలకు రిజర్వేషన్లు అడిగితే ఏ లెక్కన అడుగుతున్నారని అన్నారు. ఇప్పుడు కుల గణన చేసి ఆ లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని అడుగుతున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కులగణన చేసి అసెంబ్లీలో ఆమోదించామని.. ఇప్పుడు దేశంలోని బీసీలంతా తెలంగాణ వైపు.. రేవంత్ వైపు చూస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ మాట్లాడినా.. తెలంగాణ వైపు చూడండి.. రేవంత్ వైపు చూడండి అని చెప్తున్నారని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ కోటా బిల్లులను నాలుగు మాసాలుగా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఫైర్ అయ్యారు. మోడీకి బీసీల బాధ తెలియాలనే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎప్పుడైనా పనిచేసి గెలిచారా..? ఎప్పుడూ రాముడు, హనుమంతుడు పేరు చెప్పి గెలవాలని చూస్తారని విమర్శించారు. మేము కూడా దేవుళ్లను పూజిస్తాం కానీ దేవుని పేరుతో రాజకీయం చేయం ఓట్లు- అడగమన్నారు. బీజేపీ ముస్లింల పేరు చెప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూస్తోంది. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేకనే ఇలాంటి సొల్లు కబుర్లు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బీసీ అని ఓట్లేయించుకున్న బండి సంజయ్.. కిషన్ రెడ్డి మాట వింటు-న్నాడని విమర్శించారు. బీసీలకు మద్దతుగా రెడ్డిలు, బ్రాహ్మణులు, ఎస్సీలు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చారు. కానీ తెలంగాణ బీజేపీ బీసీ నేతలకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ఢిల్లీలో కాంగ్రెస్ మహాధర్నా చూసైనా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



మొదటిపేజీ తరువాయి

# గాంధీ కుటుంబాన్ని పొగడడానికే బిసి ధర్నా

దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ దే అని ఆయన ఉద్ఘాటించారు. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అది చేయలేక.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తామంటే చూస్తు ఊరుకోమని కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. చట్టపరమైన, న్యాయపరమైన ప్రణాళిక లేకుండా.. కామారెడ్డి డిక్లరేషన్‌ను రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. 18 నెలలు గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాల అమలు ఊసెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్ రెడ్డి విమర్శిస్తే.. అది ఆకాశం మీద ఉమ్మేయడమే అని కిషన్ రెడ్డి విర్శించారు. వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు- చేయాలి కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. రజకులు, గౌడ్లు.. ఇలా ఏ ఒక్క బీసీ వర్గాన్ని వదలకుండా అందరినీ కాంగ్రెస్ నిట్టనిలువునా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని నిర్వహించడం లేదన్నారు. రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు తప్ప.. సీఎం రేవంత్‌కు బీసీలకు సాధికారత కల్పించే విషయంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. తెలంగాణలో ధర్నా చేస్తే.. ఎవరూ పట్టించుకోరని.. ఢిల్లీకి వచ్చి పగటివేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరు అధికారంలో ఉన్నా.. మజ్లిస్ పార్టీ చెప్పినట్లు- పనిచేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారికంగా 10శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తే.. బీసీలకు రాజ్యాధికారం కష్టమేననేది తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను బీజేపీ అంగీకరించదని తేల్చి చెప్పారు. దేశంలో మోదీ నేతృత్వంలో ప్రజలకు సుస్థిరమైన పాలన అందుతోదని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

మొదటిపేజీ తరువాయి

# ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న వరదలు

హిమాచల్ రాష్ట్ర వ్యాప్తంగా గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. టాంగ్లింగ్ ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా కిన్నెర్ కైలాష్ యాత్ర మార్గంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో వందలాది మంది యాత్రికులు పర్వత మార్గంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. రోప్‌వే సాయంతో దాదాపు 413 మంది యాత్రికులను రక్షించారు ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కాగా, రెండు రోజుల నుంచి హిమాచల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు చాలాచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ కారణంగా దాదాపు 450 రోడ్లను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా మండి జిల్లా అత్యంత ప్రభావితమైంది. ఇక్కడ దాదాపు 295 రోడ్లు మూసుకుపోయాయి. ఇక సిమ్లాలోని చక్కిమోర్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో కీలకమైన చండీగఢ్-సిమ్లా జాతీయ రహదారిని అధికారులు మూసివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉనా, కాంగ్రా, మండి, సిర్మోర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

మొదటిపేజీ తరువాయి

# బీసీల రిజర్వేషన్ల బిల్లును సాధించి తీరుతాం : సీఎం రేవంత్

న్యూఢిల్లీ, ఆగస్టు6(సమయజ్యోతి):

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించటానికి ఇండియా కూటమి కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అంత కదం తొక్కారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలుకు ధర్నా చేపట్టారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చే వరకు వదలము అని నినదాలు చేశారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీల రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసి.. రాష్ట్రపతికి పంపినట్లు తెలిపారు. ఇంతవరకు రాష్ట్రపతి బిల్లును ఆమోదించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియా కూటమి మద్దుతు ఇస్తుందని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగాం.. కానీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ తరహాలో దేశంలోనూ జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని మోదీ, అమిత్‌షా చెప్పి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బీసీ బిల్లు ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతామని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రానికి బిల్లు పంపి 4 నెలలు అవుతున్నా ఆమోదించడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ధర్నా చేస్తున్నా కేంద్రానికి కనువిప్పు కలగడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకపోతే.. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధాని చేసి రిజర్వేషన్లు సాధించుకుంటామని ప్రతిఘటించారు. రిజర్వేషన్లు ముస్లింల కోసం కాదు.. బలహీన వర్గాల కోసం ఆయన స్పష్టం చేశారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

# నేడు ఎస్సారెస్పీ నుండి లక్ష్మీ, కాకతీయ కెనాళ్లకు నీటి విడుదల

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాల దృష్ట్యా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి లక్ష్మీ కాలువకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన సానుకూలంగా స్పందించి, గురువారం నీటి విడుదలకు అధికారులను ఆదేశించారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ ముత్యాల సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఆయన బుధ వారము శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికీ లోటు వర్షపాతం నమోదైన దృష్ట్యా నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. బాబ్లీ, విష్ణుపురి ప్రాజెక్టుల నుండి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో నీరు కలుస్తున్నా, ప్రస్తుతానికి ప్రాజెక్టు నీటిమట్టంలో అంత పెద్ద మార్పు ఏమి కనిపించడం లేదని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో భారీ వర్షాలు కురవడం ద్వారానే ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. దేవుడి దయవల్ల భారీ వర్షాలు కురుస్తాయని ఆకాంక్షించారు.



# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారము ఎంఈఓ బట్టు రాజేశ్వర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త చిరస్మరణీయులని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఇన్చార్జి హెచ్ఎం ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సిఎస్ఆర్ ఆక్టివిటీ ద్వారా బంగారి గూడ విద్యార్థులకు అవసరమైన సామాగ్రి అందజేత.- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బంగారి గూడ ఎంపీపీస్ స్కూల్ విద్యార్థులకు సిఎస్ఆర్ యాక్టివిటీ లో భాగంగా బుధవారం ఎస్బిఐ ఆద్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న అవసరమైన సామగ్రిని జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఐదవ తరగతి గదిలో విద్యార్థులకు గణితం బోధిస్తున్న తీరును, విద్యార్థుల వరకు బుక్కును పరిశీలించారు.తర్వాత ఆర్ఓ ప్లాంట్ ను



# పేదింటి వివాహానికి పుస్తే మట్టెలు వితరణ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామం పేదింటి ఈరవేణి పుష్పల కుమార్తె రమ్య వివాహానికి గూడెం వాస్తవ్యులు చిట్నేని వెంకటేశ్వరరావు మాధవి దంపతులు పుస్తే మట్టెలు వితరణ చేశారు. ఆ దాతలకు బిజెపి నాయకులు కోల కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిట్టు, నాని, శ్రీనివాస్ గౌడ్, కోడిముంజ శ్రీనివాస్, తారకేశ్వర్ రావు, కంచెం స్వామి, నిశ్వంత్ పాల్గొన్నారు.



# పాడి పశువులతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

నేడు పంపిణీ చేస్తున్న పాడిపశువులను వినియోగించుకొని పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పశువుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేసే పశువులకు డెలీవరి తర్వాత 12 నుంచి 15 లీటర్ల పాలు అందిస్తాయని, ఎస్సీ లబ్ధిదారులకు నేడు 2 పశువులను సబ్సిడీపై అందిస్తున్నామని, వీటిని వినియోగించుకుంటూ ఆర్థికంగా ప్రజలు ఎదగాలని, 2 పశువులను క్రమం పద్ధతిలో 10 పశువుల స్థాయికి పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పశువులకు సంబంధించి డైట్ చార్ట్ తెలుగు లో తయారు చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ జిల్లా వెటర్నరీ అధికారిని ఆదేశించారు. నేడు 14 మంది లబ్ధిదారులకు ఇక్కరికి 2 చొప్పున 28 పశువులు పంపిణీ చేస్తున్నామని భవిష్యత్తులో ప్రతి మండల స్థాయిలో ఎటువంటి కార్యక్రమంలో నిర్వహిస్తామని తెలిపారు. హర్యానా నుంచి వచ్చిన ప్రజలు స్థానికంగా అలవాటు పడడానికి వారం రోజులు మేం పడుతుందని అన్నారు. సబ్సిడీతో పంపిణీ చేసిన పశువులను బయట అమ్మడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. ప్రతి పశువుకు భీమ సౌకర్యం



కూడా కల్పించామని అన్నారు. పశువుల ద్వారా ప్రతిరోజు 2000 రూపాయల ఆదాయం లభిస్తుందని అన్నారు. హర్యానా పశువులను తీసుకుని రావడంతో కృషి చేసిన వెటర్నరీ అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షా కాలంలో పచ్చి గడ్డి బాగా దొరుకుతుందని, వీటిని వినియోగించుకుని పశువులకు మంచి ఆహారం అందించాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసిన పేద కుటుంబాలకు పశువులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు స్కీం పేరుతో స్కాం లకు పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వ పథకం ద్వారా అందించే బర్రెలకు ఆరోగ్యపరంగా, బీమా, వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ డైరీలకు లబ్ధిదారులు పాలు పోయాలని ఆయన సూచించారు. సిరిసిల్ల ఏఎంసి చైర్ పర్సన్ స్వరూప రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందాలని లక్ష్యంతో పశువులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని, లేగ దూడలకు పాలు కొంత వదిలి మిగిలినవి పిండుకోవాలని , లేగ దూడల పోషక లోపాలు రాకుండా చూసుకుంటే మంచి జరుగుతుందని అన్నారు. పశువులకు అందించే గడ్డి ఆహారంలో ఎటువంటి కెమికల్ వాడవద్దని, సిరిసిల్ల లో పాలు అమ్ముకోవాడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అందిస్తూ... పాఠాలు బోధించాలి..

## అంగన్వాడి భవనాలను కేకే మహేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన కలెక్టర్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ప్రీ ప్రైమరీ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాల భవనాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో మొత్తం 585 అంగన్వాడీ కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని వివరించారు. డీఎంఎఫ్టీ నిధులు 20 కోట్లతో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 170 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో మొత్తం 49 నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని భవనాలు రానున్న ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాల భవనాలను ప్రారంభించామని వివరించారు. ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతన భవనాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. పిల్లలు ఆడుతూ.. పాడుతూ విద్యను అభ్యసించే అవకాశం వస్తుందని వివరించారు. పక్కా భవనాలతో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని ఇబ్బందులు తొలగిపోతున్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.



# మావల సబ్ సెంటర్ ఆకస్మిక తనిచేసిన జిల్లా అధికారులు డి ఎం హెచ్ ఓ డా నరేందర్ రాటోడ్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

అంకోలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని మావల సబ్ సెంటర్ లోఈరోజు ఇమ్మ్యునైజెషన్ లో భాగంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డా నరేందర్ రాటోడ్ డిప్యూటీ జిల్లా వైద్యదికారిని డా సాధన జిల్లా ఇమ్మ్యునైజషన్ అధికారి డా. వై. సి. శ్రీనివాస్ జిల్లా మలేరియా అధికారి మిట్టపెల్లి శ్రీధర్ ఒక్కసారిగా ఆకస్మికంగా తనిఖీ చేశారు,రికార్డ్స్ సరిగా లేకపోవటంతో మావల డా శిరీష ఎం ఎల్ హెచ్ పి ని నీకు బాధ్యత లేదా రికార్డ్స్ ఎవరుచుస్తాలేరా, రికార్డ్స్ అన్ని పూర్తిగా రాయాలని మండిపడ్డారు ఇమ్మ్యునైజీషన్ సంబంధించిన పరికరాలు కాట్టర్, బ్యాగ్స్, కిట్, డ్యూ లిస్ట్ గూర్చి ఇమ్మ్యునజషన్ అధికారి వై. సి శ్రీనివాస్ ఏ ఎన్ ఎం ఇర్ఫానా, సజిదా, లను ఆడిగినారు,కార్యక్రమం లో ఏరియా హెల్త్ సూపర్ వైజార్ ఆడే సురేష్ పాల్గొన్నారు,డి ఎం ఓ శ్రీధర్ డెంగ్యూ కేసులగూర్చి అడిగి శానిటేషన్ పై పూర్తిస్తాయి లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూపర్ వైజార్ ఆడే సురేష్ కు చెప్పినారు,డిప్యూటీ వైద్యాధికారి ని మాతశిశు కార్యక్రమాలపై గర్భిణీలకు, తల్లులకు, ప్రజలకు అవగానా కలిగి కల్పించటం మన బాధ్యత అని ఎం ఎల్ హెచ్ పి కీ చెప్పడం జరిగింది, ఆశా కార్యకర్త శారద ప్రతిరోజు ఇంటింటి కీ తిరిగి ఆరోగ్య సూచనలు ఇవ్వాలని జిల్లా అధికారులు డా సర్ఫరాజ్ గారికి తెలపడమైంది



# తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొ.కొత్తపల్లి జయశంకర్ : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన గొప్ప విద్యా వేత్త ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ లో బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి పురస్కరించకుని వారి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణనే తన ఆశ, శ్వాసగా జీవించి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి మలి దశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ మార్గదర్శనంగా నిలిచారన్నారు. ఆచార్య జయశంకర్ మన మధ్య లేనప్పటికీ.. మన అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వెల్లడించారు. ఆచార్యుని ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డిపిఆర్ఓ వి.శ్రీధర్, జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి రాందాస్, ఎడి మైనింగ్ క్రాంతి కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

## ట్రంప్ విపరీత ధోరణలకు సవాల్ విసరాలి !

ట్రంప్ విపరీత ధోరణి ప్రపంచానికి పెను సవాల్ కానుంది. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు చూస్తుంటే అమెరికాకు గులాంగిరీ చేయాలన్న ధోరణి కనిపిస్తోంది. వివిధ దేశాలపై అక్కసు వెళ్లగక్కడం, విపరీతంగా సుంకాలు విధించడం, మేం చెప్పినట్లుగానే నడచుకోవాలనడం, ఫలానాదేశంతో వాణిజ్యం చేయవద్దు, అమెరికా వచ్చే విద్యార్థులపై ఆంక్షలు పెట్టడం వంటివన్నీ పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయి. ఇంత దారుణంగా గతంలో ఏ రాజ్యాధినేతా వ్యవహరించలేదు. ఎవరు ఎవరితో వ్యాపార్యం చేయాలో నిర్ణయించ డానికి ట్రంప్ ఎవరు. మార్కెట్లో సరుకులు ఎక్కడ కొనాలన్నది ట్రంప్ ఆదేశిస్తే ఎలా? ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. వ్యాపారా, వాణిజ్య పరంగా ఆయా దేశాలకు ఉన్న స్వేచ్ఛ ఇది. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయించజాలదు. అమెరికా ఆధిపత్య ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించి ఉండవచ్చు. దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. అమెరికా బెదిరింపులకు అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. నష్టదాయక ఒప్పందాలకు లొంగకుండా గొంతెత్తాలి! అమెరికాను బ్యాన్ చేసే దాకా పోరాడాలి. ఇదే సందర్భంలో నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు. రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న హక్కు ఏమిటి. ఇలాంటి పెడ ధోరణులను సహించడం సరికాదు. ఆదిలోనే తుంచేయాలి. అంతేనా అంటే మనతో శతృత్వం పెంచుకున్న పాక్‌ను చేరదీయడం, దానికి ఆయుధ సంపత్తిని, ఆయిల్‌ను పంపడం, ఆర్థిక సాయం చేయడం పాముకు పాలు పోసి పెంచడం తప్ప మరోటి కాదు. అమెరికాలో ట్విన్ టవ్స్ కూల్చివేతను ట్రంప్ మరచినట్టు ఉన్నాడు. పాక్‌ను పెంచి పోషిస్తున్న ట్రంప్‌కు గుణపాటం తప్పదు. ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే- అమెరికా నుంచి ఈ తరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలిం పులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటన్నది విశ్వేషించాలి. ఇలాంటి ధోరణులపై భారత్ తక్షణం స్పందించాలి. ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. ట్రంప్‌ను మోసిన ఎలాన్ మస్క్‌నే మోసం చేసిన ఘనుడు ట్రంప్. ఎన్నికల ముందు మస్క్‌తో దోస్తానా కట్టి డబ్బులు ఖర్చు పెట్టించి ఇప్పుడు మస్క్‌కే మస్కా కొట్టాడంటే ట్రంప్ ఎంతటి ద్రోహియో అర్థం చేసుకోవాలి. తాను అనుకుంటున్నట్టుగా ప్రపంచాన్ని నడిపించాలని అనుకుంటున్నాడు. అందుకే సుంకాలతో బెదిరిస్తూ.. కర్రపెత్తనం చెలాయించాలని చూస్తున్నట్లుగా ఉంది. దీనికి ప్రపంచ దేశాలు ఏకమై ఎదురుదాడికి దిగాలి. నిజానికి భారత్ గట్టిగా పిలుపునిస్తే ఎక్కడో పడిపోతాడు. రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పేట్రేగుతున్న తీరును మొగ్గలోనే తుంచేయాలి. అధిక సుంకాలు విధిస్తానని గత ఏప్రిల్‌లోనే ఇండియా, చైనా, బ్రెజిల్, మెక్సికో, కెనడా సహా 30 దేశాలను బెదిరించిన ట్రంప్ చైనా తదితర దేశాల నుంచి ఎదురు సుంకాలు గొంతెత్తటంతో- అమలుకు 90 రోజులు గడువంటూ మిన్నకున్నాడు. ఒకపక్క ఇండియా - అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగానే- మన ఎగుమతులపై 25 శాతం సుంకాలను విధించటం, ఇది ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుందంటూ ఏకపక్షంగా ప్రకటించటం అమెరికా ఆధిపత్య ధోరణికి, ట్రంప్ అహంకార వైఖరికి నిదర్శనంగా చూడాలి. ఏదోవిధంగా మనదేశంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, తమ వాణిజ్య ప్రయోజనాలను సాధించాలన్నది అమెరికా వ్యూహంగా ఉన్నట్లుగా ఉంది. అయితే ట్రంప్ పెడధోరణిని అక్కడి ప్రజలే సహించడం లేదు. దీనికి భారత్ నుంచి సరైన, దీటైన సమాధానం ఇవ్వటం చాలా అవసరం. అవసరమైతే అన్నదేశాలను కూడగట్టాలి. ట్రంప్ తెంపరితనాన్ని ఎండగట్టాలి. అమెరికా ఫస్ట్ అన్న నినాదం తలకెత్తుకున్న ట్రంప్... ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం నుంచి తప్పించుకోవటానికి అధిక సుంకాలు విధించటం, యుద్ధ భయాలను పెంచటం ఓ గొప్ప పరిష్కారంగా ఎంచుకొని ఆ దిశగా పావులు కదుపుతున్నాడు. ఇది సహించాల్సిన అవసరం లేదు. విస్తారమైన వ్యాపార అవకాశాలు ఉండడంతో మనదేశంలోకి తమ వ్యవసాయ, డైరీ ఉత్పత్తులతో ముంచెత్తాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. మోడీ ప్రభుత్వం ఆ ఒత్తిళ్లకు తలొగ్గి, ఇప్పటికే లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొను గోలుకు, చమురు దిగుమతికి అంగీకరించింది. మరింత వాణిజ్య చొరబాటుకు ట్రంప్ పరివారం మంత్రాంగం నడుపుతోంది. వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఔషధ రంగాల్లోకి తన కార్పొరేట్ తాబేదార్లను దించాలని ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగంతోనే తీవ్ర ఒత్తిళ్లకు, పెత్తందారీ పోకడలకు దిగుతోందని అర్థం చేసుకోవచ్చు. వీటికి తలొగ్గకుండా మేకిన్ ఇండియా అంటున్న మోడీ గట్టిగా స్వదేశీ నినాదంతో ముందుకు సాగాలి.నిలబడి కొట్లాడాలి. మనదేశంలో మన వస్తువులే వాడితే ప్రపంచ దేశాల పెత్తనం ఉండదు. ట్రంప్ తలనొప్పీ ఉండదు. భారత టెక్కీలు అమెరికా వీడితే మన పవర్ ఏమిటో తెలుస్తుంది.

# తెలంగాణ ఉద్యమ పితామహుడు

## ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భంగా



వరంగల్,ఆగస్ట్6(సమయజ్యోతి):

తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని లెక్కలతో సహా ప్రజల ముందుంచి తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించడం ద్వారా ఆజన్మాంతం తెలంగాణ కోసం పరితపించిన ధీశాలి దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్. మన వనరులపై మనకే పూర్తి అధికారం కావాలని రావాలని గొంతెత్తి పోరాడారు. యాచక దశ నుంచి శాసన దశకు తెలంగాణ రావాలె, మా రాష్ట్రం మాకు కావాలి అంటూ విన్నవించారు. తెలంగాణలో అభివృద్ధి నత్తనడకన కొనసాగుతూ ఉంది. నీళ్లలో మన వాటా తేలిన తర్వాత జలవనరుల విషయంలో స్వేచ్ఛ ఉంటుంది. స్వయం పాలనలో శ్వాసిస్తాం, ఇతరుల పాలనలో యాచిస్తూ ఉన్నాం అని నిర్మొహమాటంగా చెప్పారు. తెలంగాణ ఉద్యమ నేతగా, రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, నీళ్లు-నిధులు-నియామకాలలో తెలంగాణ నష్టపోయిందంటూ పలు సమావేశాలలో తన గొంతుక వినిపించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 1934, ఆగస్ట్ 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆత్మకూర్ మండలం, అక్కంపేట గ్రామంలో మహాలక్ష్మి, లక్ష్మీకాంతారావు దంపతులకి జన్మించారు. తెలంగాణ కోసం ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండి పోయారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్లం, హిందీ భాషలలో మంచి ప్రావీణ్యం కలిగి తెలంగాణ గొంతుకను అనేక సందర్భాల్లో అనేక చోట్ల వినిపించారు. బెనారస్ యూనివర్శిటీ- నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా తీసుకుని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసారు. 1975 నుంచి 1979 వరకు సీకేయం కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. 1979 నుంచి 91 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు అదే విశ్వవిద్యాలయంలో ఉపకులపతిగా సేవలు అందించారు. పాఠశాల దశలోనే 'ఇడ్లీ సాంబర్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేసారు. 1969లో తెలంగాణ తొలి దశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. తరవాత 1995లో మలి దశ ఉద్యమంలో మార్గనిర్దేశకుడిగా నిలిచారు. తెలంగాణలోని ప్రతి పల్లె ఆయన మాటలతో ఉద్యమానికి ఊపిరి ఊదింది. ఊరూరా తెలంగాణ నినాదాన్ని విశ్వవ్యాప్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో ఉద్యమ స్వరూపాన్ని వివరించారు. 2009 డిసెంబరు 23న శాసనసభ తీర్మానం ద్వారా రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తామన్న చిదంబరం ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు ప్రారంభం అయ్యాయి. ఆ ప్రకటనతో జయశంకర్ సార్ తీవ్ర స్థాయిలో మనస్తాపం చెందారు. పల్లె, పట్టణాలను ఉద్యమం వైపు మళ్లించి సామాజిక రాజీనామాలు, ఛలో అసెంబ్లీ ఉద్యమ కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా నిలిచారు. తెలంగాణ మేధావులతో చర్చించి, కవులు, కళాకారులు, రచయితలు, ఉపాధ్యాయ, ఉద్యోగులు, జర్నలిస్టులు, వివిధ పార్టీల ప్రతినిధులు, అన్ని కుల సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని ముందుకి తీసుకుపోయారు. అయితే తెలంగాణ ఏర్పాటును కళ్లారా చూడకుండానే జయశంకర్ సార్ క్యాన్సర్‌తో బాధపడుతూ 2011 జూన్ 21న కన్నుమూశారు. తెలంగాణ ప్రభుత్వం జయశంకర్ సార్ సేవలను గుర్తించి ఆయన పేరు మీద అగ్రికల్చరల్ యూనివర్సిటీ-, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు- చేసింది. ఆయనకు తెలంగాణ తల్లి ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

# ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం

## పడుగు పేకలే వారి జీవన సమరం

భారతీయ సంప్రదాయానికి మూలస్థంభంగా నిలిచిన గొప్ప చేతివృత్తి చేనేత. పద్మశాలీ, దేవాంగ, తొగట, పట్టుశాలి, జాంద్ర, కైకాల, కుర్ణి వంటి అనేక వర్గాలు తరతరాలుగా చేతివృత్తిని జీవితంగా మలచుకున్నారు. వారిపాలిటి నైపుణ్య సంపద, సాంస్కృతిక పరంపర చేనేతలో ప్రతిఫలిస్తూ నేటికీ కొనసాగుతోంది.చేనేత అనేది భారతీయ సంప్రదాయానికి మూలస్థంభంగా నిలిచిన గొప్ప కుటీర పరిశ్రమ. పద్మశాలీ, దేవాంగ, తొగట, తొగటవీర క్షత్రియ, పట్టుశాలి, జాంద్ర, స్వకులసాలి, కైకాల, కుర్ణి, కర్ణ భక్తులు, కరికాల భక్తులు, భవసార క్షత్రియ, నీలి, నీలకంఠ, నెస్సి, కురిమిచెట్టి, కత్రి, సెంగుందం వంటివారు ఈ రంగానికి ప్రాణంగా నిలిచారు. వారిపాలిటి జీవన శైలి, నైపుణ్య సంపద, సంస్కృతీ పరంపర ఈ రంగంలో ప్రతిఫలిస్తూ నేటికీ కొనసాగుతోంది. చేనేత నూలు దారాలు పడుగు (నిలువు వరుసలు) మరియు పేక (అడ్డ వరుసలు)గా మగ్గంపై నేతగా పోయి మృదువైన కళాఖండాలను జన్మనిస్తాయి. ఈ హస్తకళే "చేనేత"గా ప్రసిద్ధి చెందింది.జాతీయ చేనేత దినోత్సవం 1905 సంవత్సరంలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమాన్ని స్మరించుకోవడానికి జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది చేనేత కార్మికులు మరియు చేతివృత్తుల వారికి జీవనోపాధిని అందించే భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత పరిశ్రమ గణనీయమైన పాత్ర పోషించింది, పోషిస్తుంది. ఈ రోజున, చేనేత ఉత్పత్తుల అందాలను ప్రదర్శించడానికి మరియు వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలను ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు మరియు ప్రదర్శనలు నిర్వహిస్తారు. భారతదేశ దేశీయ సంస్కృతిని కాపాడటంలో చేనేత నేత కార్మికులు పోషించే పాత్రను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. అత్యంత గొప్ప పాత్ర పోషించేదిగా చెప్పవచ్చు.జాతీయ చేనేత దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జరుపుకొంటారు. ఈ దినం శతాబ్దాలుగా భారతదేశ వస్త్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికులకు ప్రత్యేకంగా భావించవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఎందుకంటే ప్రపంచం పెరుగుతున్న పర్యావరణ సంక్షోభాన్ని మరియు స్థిరత్వం గురించి పెరుగుతున్న ఆందోళనలను ఎదుర్కొంటోంది. చేనేత నేయడం పవర్ లూమ్స్ (మరమగ్గాలు) ద్వారా తయారయ్యే వస్త్రాలకు పర్యావరణ అనుకూలమైన మరియు స్థిరమైన ప్రత్యామ్నాయం. భారతదేశంలోని లక్షలాది చిన్న-స్థాయి చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇస్తుంది.పారిశ్రామికీకరణ మరియు సామూహిక ఉత్పత్తి పెరుగుదల అనేక మంది చేనేత కార్మికుల జీవనోపాధికి ముప్పు తెచ్చిపెట్టింది. చాలామంది తమ చేతివృత్తిని విడిచిపెట్టి ఇతర పనిని కనుగొనవలసి వస్తోంది. కావున జాతీయ చేనేత దినోత్సవం ఈ సంవత్సరం నుండి చేనేత ద్వారా తయారయ్యే వస్త్రాల ఉత్పత్తి మనుగడను పరిరక్షించడానికి మరియు దానిని సజీవంగా ఉంచే నేత కార్మికులకు మద్దతు ఇవ్వడానికి ప్రత్యేకంగా నిలిచింది. 1905లో కలకత్తాలో బాల గంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, మరియు బిపిన్ చంద్ర పాల్ వంటి ప్రముఖ నాయకులు ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం జ్ఞాపకార్థం ఆగస్ట్ 7వ తేదీని ఎంచుకున్నారు. ఈ ఉద్యమం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం భారతదేశ పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించిన చేనేత వస్త్రాలతో సహా భారతీయ నిర్మిత వస్తువులను ఉపయోగించాలని సూచించింది. భారతదేశంలో చేనేత నేయడం గురించిన మొట్టమొదటి సూచనలు సుమారు క్రీ.పూ. 1500 నాటివి. పత్తి, పట్టు మరియు ఉన్ని నుండి వస్త్రాన్ని నేయడం, సహజ వర్ణద్రవ్యాలను ఉపయోగించి బట్టలకు రంగులు అద్దడం గురించి వాటిలో వివరించబడింది.శతాబ్దాలుగా, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతూనే ఉంది. చేనేత కార్మికులు కొత్త పద్ధతులు, నమూనాలు మరియు సామగ్రిని సృష్టిస్తూ వారి ప్రత్యేకతను, నైపుణ్యాన్ని అభివృద్ధి చేశారు, చేస్తున్నారు.భారతదేశంలో చేనేత వస్త్ర పరిశ్రమ కేంద్రాలు - ప్రాముఖ్యతభారతదేశంలో చేనేత పరిశ్రమ అనేది సంప్రదాయ వారసత్వంతో కూడిన గొప్ప కళారూపం. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఉన్న ప్రత్యేక కేంద్రాలు తమకు తానుగా ఒక ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఈ కేంద్రాలు భారతదేశ ఆర్థిక, సాంస్కృతిక జీవన శైలిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.వారణాసి - బనారసీ పట్టు చీరలు బంగారు, వెండి పందెలు, బూటీ డిజైన్‌లతో తయారవుతూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచాయి.కాంచీపురం - దక్షిణ భారత సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే కాంచీపురం చీరలు, జరీ పనులు, శాస్త్రోక్త రంగులతో పేరుగాంచాయి. పోచంపల్లి - తెలంగాణకు చెందిన ఈ కేంద్రము 'ఇక్కత్' శైలిలో రంగుల మేళవింపుతో ప్రత్యేకతను సంపాదించింది. సుయల్కుచీ - అస్సాంలో ముఘా, ఎరి సిల్క్ ఉపయోగించి అత్యంత మృదువైన మెరుపుతో చీరలు తయారు చేస్తారు. చాందేరి - మధ్యప్రదేశ్‌కి చెందిన చాందేరి చీరలు తేలికపాటి పనితనంతో కళాత్మకంగా ఉంటాయి.సంబల్పురి - ఒడిశాలో ఐకాట్ శైలిలో రూపొందే చీరలు సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తాయి.
మహేశ్వర్ - మహేశ్వరి చీరలు ప్రత్యేకమైన స్ట్రైప్, చెక్స్ డిజైన్లతో ప్రసిద్ధి.
శాంతిపుర్-పూలియా - పశ్చిమ బెంగాల్‌లో జమదాని శైలిలో రూపొందే మృదువైన వస్త్రాలు.
భరదారురి - బిహార్‌లో టుస్సార్, మ్యాట్కా సిల్క్ వాడకం ప్రత్యేకత.
కొటా - రాజస్థాన్‌కు చెందిన దోరియా నమూనా చీరలు వేసవికాలానికి అనుకూలం.పటాన్, సూరత్, పణిపట్ - గుజరాత్‌లో పటాన్ 'పటోలా' చీరలకు ప్రసిద్ధి, సూరత్ నెసన రంగానికి, పణిపట్ హోం టెక్స్‌టైల్స్‌కు ప్రముఖ కేంద్రాలు.
చేనేతన్నకు ఉపాధి కల్పించిన తెలంగాణ ప్రభుత్వతెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేనేత కార్మికుల ఉపాధి కోసం చేపట్టిన అద్భుత పథకం "చీరల తయారీ పథకం". సిరిసిల్ల ప్రాంతంలో చాలామంది నేతన్నలు తమ జీవనోపాధిని చేనేతపై ఆధారపడ్డవారు. గతంలో మరమగ్గాలపై నేస్తూ కష్టాల పాలయ్యే వారు ఇప్పుడు ప్రభుత్వ మద్దతుతో కొత్త వెలుగు చూశారు. కూలీలు తక్కువగా ఉండే పరిస్థితుల్లో ఈ పథకం వారికి ఆదరణగా నిలిచింది. వలస వెళ్లే అవసరం లేకుండా, స్థానికంగా స్థిరమైన ఉపాధిని పొందగలుగుతున్నారు. ఇది చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన కార్యక్రమం. సిరిసిల్ల నేతన్నల ముఖాల్లో ఆనందం దీని విజయానికి నిదర్శనం. ఇలాంటి ఆలోచనాత్మక కార్యక్రమాల ద్వారా చేనేత పరిశ్రమ దేశ ప్రగతికి వెన్నెముకగా నిలిచింది. చేనేత వస్త్రాల్లో కాటన్, సిల్క్, ఉన్ని, భాదీ, పట్టు వస్త్రాలు ప్రసిద్ధి. చీరలు, పంచెలు, దుస్తులు, దుప్పట్లు, శాలువాలు, కండువాలు వంటి అనేక ఉత్పత్తులు చేనేత ద్వారా అందుబాటులోకి వస్తున్నాయి.చేనేత పరిశ్రమలో పరికరాల విభాగాలు - శ్రమకు శాస్త్ర సమ్మేళనం చేనేత పరిశ్రమలో ఉపయోగించే పరికరాలు, యంత్రాలు, ఉపకరణాలు అన్నీ కలసి ఒక సంపూర్ణ ఉత్పత్తి వ్యవస్థను ఏర్పరుస్తాయి. ఈ వ్యవస్థలో ప్రధానంగా మగ్గాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఇవి హస్తచేతితో నడిపే మెకానికల్ పరికరాలు కాగా, అల్లే ప్రక్రియలో కీలకమైన పునాది. వీటికి రకాలుగా పిట్ట మగ్గం, జకార్డ్ మగ్గం, ఫ్రేమ్ మగ్గం, చక్ర మగ్గం వంటి వేర్వేరు మోడళ్లు ఉంటాయి. మరమగ్గాలు అనేవి వీటితో పాటు సమాంతరంగా ఉపయోగించబడే చిన్న యంత్రాలు, అవి నిర్మాణానికి అవసరమైన కలప, ఇనుము, తాళ్లు మొదలైన వాటిని కలిపి మగ్గాన్ని గట్టిగా నిలబెట్టే పనిని చేస్తాయి. సైదింగులు అనేవి మగ్గానికి పక్క పక్కన అమర్చే మెటల్ లేదా చెక్క ఫ్రేములు, ఇవి దారాన్ని సరిగా పట్టి ఉంచే విధంగా



తయారవుతాయి. వార్పింగ్ యూనిట్లు అనేవి మగ్గానికి ముందు దారాన్ని సిద్ధం చేసే పరికరాలు. వీటితో డిజైన్ ప్రకారం రంగుల దారాన్ని సమతుల్యంగా అమర్చడం జరుగుతుంది. రంగుల సమతుల్యత ఉండేలా చూసే ప్రక్రియలో క్రమంగా డిజైన్ అనుసరించే శ్రేణీకరణ చేయబడుతుంది. కలర్ ప్రాసెసింగ్ యూనిట్లు అనేవి రంగుల దారాన్ని తయారు చేసే ప్రాంతాలు, ఇవి ముఖ్యంగా వర్ణజాలంలో ఉత్సాహాన్ని తీసుకువచ్చే రంగులు, బ్లీచింగ్, డైయింగ్, వాషింగ్, డ్రైయింగ్ వంటి ప్రక్రియలను నిర్వహిస్తాయి. రంగుల స్థిరత్వం, మెరుపు, మృదుత్వం అన్ని ఈ యూనిట్ల పనితీరుపై ఆధారపడి ఉంటాయి. పేపర్ రూమ్‌లో యూనిట్లు అనేవి డిజైన్ చేసిన వస్త్రాన్ని ప్రింటింగ్ లేదా ఫినిషింగ్ చేసే విభాగాలు. ఇక్కడే బట్టలపై ముద్రణ, మడత, స్టిచింగ్, కటింగ్ వంటి చివరి పనులు జరుగుతాయి. ప్రతి యూనిట్ ఒక దశలో పనిచేస్తూ ఒక ముస్తాబు చేనేత వస్త్రాన్ని రూపొందించడంలో భాగం అవుతుంది. మొత్తం మీద ఈ యంత్ర సమాహారం వలన చేనేత ఉత్పత్తి శాస్త్రీయంగా, శ్రమలాభదాయకంగా మారుతుంది.
యంత్రాల్ని మించిన మానవ హస్తకళ
ఇన్ని ఆధునిక పరికరాలు ఉన్నప్పటికీ, చేనేత ముల్లెకట్టు వెనకున్న ప్రాణం మాత్రం మనిషి చేతి శ్రమ. మగ్గాలు మరమగ్గాలు ఎంత ప్రగతిచేసినా, నేతన్న చేతి తాకిడిలేకుండా ఒక వస్త్రం రూపుదాల్చదు. మానవ హస్తకళే దీనికి శ్వాస. చేనేత అంటే యంత్రం కాదు - %అది ఒక జీవన విధానం.చేనేత హస్తకళను ఆదరిద్దాం, అందమైన చేనేత వస్త్రాలను గర్వంగా ధరిద్దాం. మన సంప్రదాయ నేత కార్మికుడికి మద్దతు తెలుపుదాం. చేనేత ఉత్పత్తుల మనుగడకు సహకరిద్దాం.

డా. చిటికెన కిరణ్ కుమార్
ప్రముఖ రచయిత,
సభ్యులు, ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసెర్చ్ ఫోరమ్

# విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను, చీర్లవంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని అన్ని తరగతి గదులు, స్టాఫ్ రూమ్, స్టోర్ రూమ్, కిచెన్, లైబ్రరీ, టాయిలెట్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, మైక్రోబాయాలజీ ల్యాబ్ లను ఫ్యాషన్ డిజైనింగ్ ఫోటోగ్రఫీ స్టూడియోలను పరిశీలించారు. విద్యార్థులతో విద్యాభ్యాసం గురించి ముచ్చటించారు.



### బాస్కెట్బాల్ కోర్టును ఏర్పాటు చేయాలి

హిస్టరీ సబ్జెక్టులో విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు బోధించి.. ప్రశ్నలు అడిగి సమాధానలు రాబాట్టారు. విద్యార్థులు ప్రతిరోజు సాయంత్రం ఆదుకునేందుకు బాస్కెట్బాల్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్ లపై పట్టు సాధించాలని సూచించారు. పాఠ్యాంశాలపై వచ్చే సందేహాలు, అనుమానాలు నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

### విద్యాలయాల ఆకస్మిక తనిఖీ

తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో పాఠ్యాంశాల బోధనను పరిశీలించారు. ప్రతి విద్యార్థితో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, ఇతర పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని, సమస్యల పరిష్కారంపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

### గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి..

చీర్లవంచ గ్రామంలోని పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దానిని కలెక్టర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కే కే మహేందర్ రెడ్డి కలిసి ప్రారంభించారు.

# గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం

## టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

ఉట్నూర్: తెలంగాణ ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క స్మరించుకున్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని, ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా సుగుణక్క గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని అన్నారు. పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవలకు గుర్తింపుగా కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను సినీ కళాకారులకు, సినీ ప్రముఖులకు అందించడం జరిగిందన్నారు. గద్దర్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, వారి ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గద్దర్ ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునిల్ జాదవ్, సంతోష్ జాదవ్,పరత్వాగ్ విశాల్,గేడాం శ్రీధర్, కనక సుదర్శన్, తిత్రే గోవింద్,వినోద్, శోభ తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి

## జయంతి వేడుకలో కలెక్టర్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్, ఆగస్టు 06 :

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేద్దామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తా వద్ద గల ఆచార్య జయశంకర్ విగ్రహానికి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సహాయ అధికారి నర్సయ్య, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆచార్య జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాధన కోసం ఆచార్య జయశంకర్ చేసిన కృషిని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి, బుస్స ఆంజనేయులు, బుస్సాపూర్ శంకర్, బీ.సీ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్, ఎం.రాజేశ్వర్, హన్మాండ్లు, చారి తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాల వారోత్సవాలు...

సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా

మండలంలోని గుడేబల్లూరు గ్రామంలో నీ అంగన్వాడి కేంద్రంలో బుధవారం రోజు తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు, ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ హనుమంతమ్మ ఏఎన్ఎం సత్యనారాయణమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ఎంతో ఆరోగ్య కరమని దీనివలన తల్లి బిడ్డలకు ఎంతో ఉపయోగకరమన్నారు, ఈ సందర్భంగా పోషక ఆహార ప్రదర్శన నిర్వహించి దాని యొక్క ప్రాధాన్యతను వివరించారు, ఈ కార్యక్రమంలోఅంగన్వాడి కార్యకర్తలు. కమల,నాగేంద్రమ్మ.ఆశ కార్యకర్తలు పద్మ ,లావణ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# వేల్పూర్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## ఎంపీడీఓ, తహసీల్ కార్యాలయాల సందర్శన

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్, ఆగస్టు 06 :

వేల్పూర్ మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహకార సంఘం ఎరువుల గోడౌన్ లను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. సాంకేతిక ఇబ్బంది కారణంగా కొంతమంది విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు కావడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న తెలుపగా, కలెక్టర్ అప్పటికప్పుడు తన సమక్షంలోనే ఎఫ్.ఆర్.ఎస్ పద్ధతిన విద్యార్థుల హాజరును ఆన్లైన్ లో నమోదు చేయించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు విధానం సంపూర్ణంగా అమలు అయ్యేలా చూడాలని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకువెళ్లాలని సూచించారు.

తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్న తీరును గమనించారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, అలాంటి వారి పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. వంట గది, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఉడకబెట్టిన కోడి గుడ్డును అందించాలని ఆదేశించారు. విద్యార్థులు అందరూ తరగతులకు ప్రతిరోజూ హాజరయ్యేలా చూడాలని అన్నారు. అంతకు ముందు కలెక్టర్ వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీ.హెచ్.సీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. కాన్పులు చేసేందుకు వీలుగా అన్ని వసతులు అందుబాటులో ఉన్నందున గర్భిణీలు స్థానికంగానే సుఖ ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీణకు సూచించారు. జాతీయ నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ, వ్యాక్సినేషన్, గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల నిర్వహణ తదితర కార్యక్రమాలు సంపూర్ణంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు వంటివి చోటుచేసుకోకుండా గట్టి నిఘా ఉంచాలని, ఏదైనా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు





గమనిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, అలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, పీ.హెచ్.సీలలో బేబీ వార్మర్లు పని చేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్, టీ.జీ.ఎం.ఎస్.ఐ.డీ.సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఫోన్ చేసి, వెంటనే అన్ని పీ.హెచ్.సిలలో బేబీ వార్మర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్తవి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలతో కూడిన బోర్డును రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, పూర్తి స్థాయిలో అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఎక్కడ కూడా ఎరువుల పంపిణీ సమయంలో టోకెన్ పద్ధతి, క్యూ విధానాలను అమలు చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడి నుండి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ బాలకిషన్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఆన్లైన్ వివరాలను పరిశీలించారు. ప్రజా పాలన సేవా కేంద్రం కొనసాగుతున్నట్లు ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతి కార్యదర్శి వినోద్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు అందరూ ఇళ్ళను నిర్మించుకునేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు.

## పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి పై దృష్టి సారించాలి

### : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 06.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధన కొనసాగించాలన్నారు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్. బుధవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామ ప్రభుత్వ జడ్పీ హై స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించి, విద్యార్థుల హాజరుతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల సరఫరాపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారికి పాఠాలు చదివించడంతో పాటు లెక్కలు చేయించారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటినుంచే పకడ్బందీగా సన్నద్ధమవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన భారతదేశ భౌగోళిక పటాన్ని పరిశీలించి మెచ్చుకున్న కలెక్టర్, ప్రతి పాఠశాలలో ఇలాంటి పటాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని ప్రతిరోజూ అందించాలన్నారు. వంటకు కట్టెల పొయ్యి బదులుగా ఎల్పీజీ వాడాలని సూచించారు. వంటగది, డైనింగ్ హాల్, నిల్వ గదులు పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి విద్యార్థిని అక్షయ కలెక్టర్ ఫోటో ఆధారంగా గీసిన బొమ్మను అందించగా, కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసిన కలెక్టర్, వాటి సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కూరగాయల విత్తనాలను నాటారు. అక్కడ పండే కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 06.

నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. దశలవారీగా పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణాన్ని వేగంగా, నాణ్యంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. ఇసుక సహా ఇతర నిర్మాణ ముడి సరుకుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, ఏఈ, అధికారులు పాల్గొన్నారు.



## జిల్లా ఖజానా కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, ఆగస్టు 06.

కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖజానా శాఖ అధికారులు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. డిటిఓ సరోజ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో తన రచనలు ప్రసంగాల ద్వారా ఎంతో మందిని ఉద్యమం వైపు ముందుండి నడిపించారని అన్నారు. తెలంగాణకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నీళ్లు, నిధులు, నియామకాలలో జరిగిన అన్యాయాలు తెలంగాణ సమాజం ముందు ఉంచి, ప్రజలను జాగృతం చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో గజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి దాత్రిక రమేష్, అధికారులు శ్యాంసుందర్, రవిచందర్, సుజన్, ఫహీం, విజయ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## హాస్పిటల్ ఖర్చుల రీఫండ్ పేరిట 15 లక్షల రూపాయల మోసానికి పాల్పడ్డ నిందితుడికి రిమాండ్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

తెలుగు రాష్ట్రాల్లో కలసి ఎన్సీఈఆర్పి పోర్టల్ 79 పిటీషన్ల మేరకు 15 లక్షల రూ.ల మోసానికి పాల్పడ్డ నిందుతుడు కడప జిల్లా జమ్మలమడుగు భాగ్యనగర్ కాలనీకి చెందిన ముల్లుంటి సలీం మాలిక్(32), హైదరాబాద్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా సైబర్ బృందం పట్టుకున్నట్లుగా సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య శాఖ నుండి మాట్లాడుతున్నామంటూ బాధితులకు కాల్స్ చేస్తూ హాస్పిటల్ ఖర్చుల రీఫండ్ చేస్తామని చెప్పి బాధితులకు మొబైల్ నుండి కాల్ చేసి వారిని ఒక లింక్ పంపించి ఆ లింకు ఓపెన్ చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే మీకు మీ ఆరోగ్యశ్రీలో ఖర్చుయిన డబ్బులు తిరిగి మీ అకౌంట్లో క్రెడిట్ అవుతాయని చెప్పాగా బాధితులు నమ్మి ఆలింక్ క్లిక్ చేసి లింక్ లో యూపీఐ పిన్ ఎంటర్ చేయడం ద్వారా డబ్బులు కోల్పోవడం జరిగింది. దీంట్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముస్తాబాద్ మండలంలో ఒక బాధితుడు, వేములవాడ టౌన్ పరిధిలో ఒక బాధితుడు మోసపోయారు. ముస్తాబాద్ అతను 46 వేలు, 10 వేలు నష్టపోవడం జరిగింది. ఈ ఘటనలపై ఎస్పీకి ఫిర్యాదు అందడంతో, ఆయన విచారణకు ఆదేశించారు.సీఐ మొగిలి, ఎస్సై గణేష్, సైబర్ టీం ఆర్.ఎస్.ఐ జునైద్, సిబ్బంది కిట్టు గంగారెడ్డి, ముస్తాబాద్ కానిస్టేబుల్ కాసిం టీమ్ గా ఏర్పడి సాంకేతికత ఆధారంగా నిందుతుణ్ణి అరెస్ట్ చేసి, రిమాండ్ చేయడం జరిగిందన్నారు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ముదినేపల్లి,ఆగస్ట్6(సమయజ్యోతి):

ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దకామనపూడిలో పెద్దప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో స్కూలు పిల్లలు క్షేమంగా బయపటడ్డారు. ప్రైవేటు- పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు వెంటనే స్పందించి బస్సు అద్దాలు పగలగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది విద్యార్థులు ఉన్నారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## వైకుంఠ రథం అందుబాటులో ఉంచాలి

### బిఎస్పీ, త్వరగా అందుబాటులో తెస్తామన్న కమిషనర్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

గత కొన్ని రోజులుగా మందమర్రి మున్సిపాలిటీలో పార్థివ దేహాలను తరలించే వైకుంఠ రథం పని చేయలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని ఉచిత వైకుంఠ రథాలు, ఫ్రీజర్స్ ప్రజలకు అందుబాటులో ఉంచాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ కోరడం జరిగింది. దీనికి స్పందిస్తూ మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాయలింగ్ మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీలో వైకుంఠ రథం గత కొన్ని రోజులుగా నడుస్తలేదు అనేది వాస్తవం వైకుంఠ రథం మరమ్మత్తు పనులు నడుస్తున్నవి ఈ వారంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పక్కన ఉన్న క్యాతన్ పల్లి మున్సిపాలిటీ నుండి వైకుంఠ రథంను పంపించడం పంపించామని వైకుంఠ రథం మరమ్మత్తు పనులు పూర్తి అయిన పేదప ప్రజలకు అందుబాటులో తీసుకొనిరగలము. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహృదయంతో సహకరించాలని కమిషనర్ గా కోరుకుంటున్నానని అన్నారు.




## ఆత్మకూరులో ప్రొపెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు.

సమయజ్యోతి న్యూస్ ఆత్మకూరు వనపర్తి జిల్లా.

ఆత్మకూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో మార్కెట్ చెర్మన్ ఎం. డి. రహిమతుల్లా తెలంగాణ సిద్ధాంతకర్త తెలంగాణ జాతీ పితామహుడు కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ పాష, ఎంపీడిఓ శ్రీపాద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

### తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు

### ప్రధానోపాధ్యాయులు నల్లే శివరాజ్

సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణ పేట జిల్లా

తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధువారం మండలంలోని కుస్నీ ప్రాథమిక పాఠశాలలో జయంతి ని ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయుడు నల్లే శివరాజ్ మాట్లాడుతూ జయశంకర్ సార్ వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో ఆగస్టు 6, 1934సంవత్సరంలో జన్మించారని, ఆయన 1952 లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఇడ్లి సాంబార్ గో బ్యాక్ అనే నినాదంతో ఉద్యమం చేశారని, అలాగే ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి తెలంగాణ చేరాలని ఆకాంక్షించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు తన జీవితాన్నే త్యాగం చేసి ఆజన్మ బ్రహ్మాచారిగా మిగిలిపోవడం జరిగిందని తెలుపడం జరిగింది,ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నల్లే శివరాజ్, ఉపాధ్యాయులు అనిత, అశోక్, అమృత, మాధవిలత, ప్రియాంక, సుప్రజ, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి ఎస్ఎస్ గార్డెన్స్ లో నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, వీటి ద్వారా పేదలకు రేషన్ అందుతుందన్నారు. మండలంలో నూతనంగా 1397 కొత్త కార్డులు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో 2224 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసి అందిస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ఇంచార్జి కే కే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొకటి అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణ మాఫీ, 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, మిల్క్ పార్లర్, ఆర్ టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఫెర్టిలైజర్ దుకాణాలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ స్వరూపారెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, డి డబ్ల్యు ఓ లక్ష్మీరాజ్యం, తహసిల్దార్ జయంత్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి చేనేత అవార్డు గ్రహీతకు సన్మానం.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత పద్మశాలి కుల పెద్దలు దేవరకొండ లచ్చన్న రాష్ట్ర స్థాయి చేనేత అవార్డుకు ఎంపిక అయ్యారు. అమరచింత పట్టు చీరలు చాలా ప్రసిద్ధిగాంచినవని అన్నారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ అధికారులు అమరచింత చేనేత కార్మికులను రాష్ట్ర స్థాయి చేనేత అవార్డుకి ఎంపిక చేయడం శుభ పరిణామని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మంత్రి సుదీర్ కుమార్ అన్నారు. అనంతరం అవార్డు గ్రహీత దేవరకొండ లచ్చన్న ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవరకొండ మోహన్,పట్టు చీరల వ్యాపారి దేవరకొండ పాండు, నాని, ఉదయ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మతనాన్ని అమ్ముకున్న నమ్రత

## ఫర్టిలిటీ సెంటర్లపై నమ్మకం కోల్పోయేలా చేసిన సృష్టి

హైదరాబాద్,ఆగస్ట్6(సమయజ్యోతి):

అమ్మతనాన్ని కూడా అమ్ముకోవడమెలాగో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చూపించారు. ఇందులో బయటపడ్డ నిజాలు ఇప్పుడు విపరీత ధోరణలును బయటపెట్టాయి. ఇలాంటి సెంటర్లు ఎన్ని ఉన్నాయో వాటి కార్యకలాపాలపైనా దృష్టి సారించాలి. సరోగసీ పేరుతో ఇతరల పిల్లలను అప్పగించి లక్షల్లో దండుకోవడమనే వ్యాపారంలో నమ్రత బాగా ఆర్జించారు. కొన్నేళ్ల క్రితమే మోసాలు బయటపడి నమ్రత లైసెన్స్ రద్దు కావడంతో ఆమె ఇతర వైద్యులను బినామీగా పెట్టుకుని వారి పేరిట లైసెన్స్ తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్ణాటక, ఒడిసా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో సృష్టి ఫర్టిలిటీ- సెంటర్ శాఖలు నిర్వహిస్తున్నట్లు- పోలీసులు గుర్తించారు. ఎంతోమంది దంపతులను సరగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత.. ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు దోచుకున్నట్లు- పోలీసులు గుర్తించారని తెలిసింది. అనేక కోణాల్లో విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా ఇప్పటికే నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్లు- పోలీసులు తెలిపారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. నమ్రత ముఠాలో కీలక పాత్ర పోషించి కల్యాణి, సంతోషిలను పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే 15 మందిని అరెస్టు చేయగా.. మరికొందర్ని అరెస్టు చేయవచ్చని సమాచారం.ఈ క్రమంలో పోలీసుల విచారణలో సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలిటీ- సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులు కస్టడీకి తీసుకుని విచారించిన గోపాలపురం పోలీసులు... సృష్టిలో మోసాలపై కీలక విషయాలు రాబట్టినట్లు- తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు, సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న బినామీ డాక్టర్ విద్యుల్లతను పోలీసులు విచారించి సృష్టిలో మోసాలపై కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇటీవల నమ్రత రాజస్థాన్‌కు చెందిన గోపాల్ సింగ్ దంపతులను సరగసీ పేరిట నమ్మించి.. మోసగించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఒడిసా దంపతులకు పుట్టిన బిడ్డను రూ.90 వేలకు కొన్న నమ్రత.. ఆ బిడ్డను రాజస్థాన్ దంపతులకు రూ.35 లక్షలకు విక్రయించింది. సరగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడుతున్న నమ్రతకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు- పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. ఆ ముఠాలకు బట్టి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు చెల్లించి చిన్నారులను కొంటు-న్నట్లు- గుర్తించారు. ఆ పిల్లల్నే సరగసీ ద్వారా పుట్టినట్లు నమ్మించి పిల్లలు లేని దంపతుల నుంచి రూ.30 నుంచి 50 లక్షలు తీసుకుంటున్నట్లు తేలింది. ఈ దందాలో హర్ష, పవన్, నందిని అనే వ్యక్తులు కీలకంగా వ్యవహరించినట్లు- పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ ఒక్క కేసు ఆధారంగా మిగతా ఫర్టిలిటీ సెంటర్ల తీరును పరిశీలించాలి. వాటి కార్యకలాపాలపై దృష్టి సారించాలి.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో 17 మంది అరెస్టు

హైదరాబాద్,ఆగస్టు6(సమయజ్యోతి):

గోపాలపురం సృష్టి ఫెర్టిలిటీ హాస్పిటల్ కేసులో తాజాగా 6 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని రిమాండ్‌కు తరలించారు. ఇప్పటివరకు మొత్తం 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. అరెస్ట్ అయిన వారిలో డాక్టర్లు, ఏజెంట్లు ముఖ్యంగా మహిళా ఏజెంట్లు అధికంగా ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రతపై ఒక్క గోపాలపురం పోలీస్ స్టేషన్‌లోనే 8 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆమెతో పాటు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యులతను కూడా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు డాక్టర్ నమ్రతకు చెందిన బ్యాంక్ ఖాతాలు, హాస్పిటల్ అకౌంట్లు ఫ్రీజ్ చేశారు. ఈ ఖాతాల్లో కోట్ల రూపాయల నగదు జమై ఉందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం మరికొన్ని ఖాతాలను కూడా గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా 70కి పైగా భార్యాభర్తలు %×ఎఫ్% చికిత్స కోసం వచ్చి, సరోగసి పేరుతో మోసపోయారని పోలీసులు వెల్లడించారు. సృష్టి ఫెర్టిలిటీ హాస్పిటల్ డాక్టర్ నమ్రత తోపాటు మరికొందరూ చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడ్డట్లు పక్కా ఆధారాలు లభించాయి. గోపాలపురం పోలీసులు మరోసారి సృష్టి హాస్పిటల్‌కి వెళ్లి కీలక డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇవి కేసుకు మద్దతుగా కీలక ఆధారాలుగా మారనున్నాయి. అలాగే, ఈ రోజు మరో కొన్ని అరెస్టులు జరగవచ్చని సమాచారం. నిందితుల జాబితా ఇంకా పెరిగే అవకాశం ఉంది. పోలీసులు డాక్టర్ నమ్రత అనుబంధంగా ఉన్న ఇతర హాస్పిటల్లను, ఆసుపత్రుల్లోని కార్యకలాపాలను పరిశీలిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బును వేరే అకౌంట్లలోకి మళ్లించి ఉండే అవకాశం ఉన్నందున ఆ దిశగా విచారణ జరుగుతోంది. ఈ కేసు కేంద్రం దృష్టికి వెళ్లే అవకాశం కూడా ఉంది. ఎందుకంటే.. చిన్నారుల అక్రమ రవాణా వంటి విషయాల్లో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించనున్నాయి.

# బీసీ బిల్లుకు డీఎంకే ఎంపీ మద్దతు

ఢిల్లీ, ఆగస్టు6(సమయజ్యోతి):

బీసీ రిజర్వేషన్లు 42శాతం కేంద్రప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ నేతలు బుధవారం జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు డీఎంకే ఎంపీ కనిమొళి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ వేదికగా కనిమొళి మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల పరిమితిని తక్షణమే సవరించాలని డిమాండ్‌చేశారు. తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని ఉద్ఘాటించారు. డీఎంకే ఎంపీ కనిమొళి. పెరియార్ కాలం నుంచి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ ఉందని గుర్తుచేశారు. దేశంలో పోరాటం చేసి రిజర్వేషన్లు పెంచుకున్న ఏకైక రాష్ట్రం తమిళనాడు అని నొక్కిచెప్పారు. బీసీ రిజర్వేషన్లు పెంపునకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు డీఎంకే పూర్తి మద్దతు ఇస్తోందని ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు అన్ని స్థాయిల్లో మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పార్లమెంటులో కూడా ఈ అంశంపై తెలంగాణ ఎంపీలు చేసే పోరాటానికి డీఎంకే మద్దతు ఉంటుందని ఎంపీ కనిమొళి పేర్కొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

హైదరాబాద్,ఆగస్టు 6(సమయజ్యోతి):

తమ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చి, డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులపై పోలీసులు ఉక్కుపాదం మోపడంపై మండిపడ్డారు. మహిళా కార్మికులందరినీ బలవంతంగా పోలీసు వ్యాన్లలో ఎక్కించి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడమే కాకుండా తమను అరెస్టు చేయడంపై మహిళా కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం..? ఇదేనా ప్రజా పాలన? అని వారు ప్రశ్నించారు. బడి పిల్లలకు భోజనం పెట్టే వ్యవస్థను కూడా సరిగ్గా నడపలేని ఈ చేతగాని రేవంత్ సర్కార్ తీరుపై కార్మికులు మండిపడ్డారు.

# వేధింపుల కేసులో హెచ్‌డీ రేవణ్ణ పిటిషన్

బెంగుళూరు, ఆగస్టు 6(సమయజ్యోతి):

జేడీయూ ఎంపీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణను లైంగిక వేధింపుల కేసు నుంచి బయటపడేసేందుకు అతడి తండ్రి, జేడీయూ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. తన కుమారుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలంటూ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశాడు. పని మనిషిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో హసన్ జిల్లాలోని హొలెనరసిపుర పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల్ రేవణ్ణపై కేసు నమోదైంది. దాంతోపాటు అతడిపై మరో మూడు లైంగిక వేధింపుల కేసులు కూడా నమోదయ్యాయి. వాటిలో ఒక కేసులో ఇటీవల ప్రజాప్రతినిధుల కోర్టు ప్రజ్వల్‌ను దోషిగా తేల్చింది. అతడికి జీవితఖైదు కూడా విధించింది. ఈ నేపథ్యంలో హొలెనరసిపుర పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని హెచ్‌డీ రేవణ్ణ హైకోర్టును ఆశ్రయించారు.

# అదుపు తప్పి నదిలో పడిపోయిన కారు.. ముగ్గురు మృతి

ఢిల్లీ, ఆగస్టు 6(సమయజ్యోతి):

హిమాచల్ ప్రదేశ్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. సిమ్లాలో ఓ కారు అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గిరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిర్గావ్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళు_న్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి పబ్బర్ నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విశాల్ థాకూర్, అభ్య కందియాన్, హిమాన్షుగా గాయపడిన వ్యక్తిని హర్ష్ చౌహాన్‌గా గుర్తించారు. నది నుంచి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే : జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఆగస్టు6(సమయజ్యోతి):

వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, కేసీఆరే మళ్లీ సీఎం అవుతారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం నివేదిక, ఢిల్లీలో కాంగ్రెస్ బీసీ ధర్నాపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి స్పందించారు. అది కాళేశ్వరం కమీషన్ రిపోర్ట్ కాదు.. కాంగ్రెస్, బీజేపీల ఆరోపణల చిట్టా అని విమర్శించారు. అసలు కమీషన్ రిపోర్ట్ తొక్కిపెట్టి కాంగ్రెస్ సొంత కథలు అల్లుతోంది. కాళేశ్వరమే తెలంగాణాకు జీవ ధార. మళ్ళీ కేసీఆర్ వస్తాడు కాళేశ్వరం నీరు అందిస్తారు. మోదీ, చంద్రబాబు డైరెక్షన్‌లో కేసీఆర్‌ను బద్నాం చేయాలని కుట్ర చేస్తున్నారు. కాళేశ్వరం నివేదిక పేరుతో కాంగ్రెస్ మోసపూరిత ప్రచారం చేస్తోంది. కాళేశ్వరం నీళ్ళ కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పోరాటానికి సిద్ధమౌతున్నారు. బనకచర్ల కోసమే కాళేశ్వరాన్ని పండబెడుతున్నారు. కాళేశ్వరం కుట్రలపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. అరెస్టులు ఉండొచ్చని చిల్లర ప్రచారం చేస్తున్నారు.. ఈ బెదిరింపులకు భయపడేది లేదు. స్థానిక ఎన్నికల్లో లబ్ది కోసమే కాంగ్రెస్ చిల్లర ప్రయత్నం చేస్తోంది. డైవర్షన్ పాలిటిక్స్‌తో విషప్రచారం చేసి మరోసారి ప్రజల్ని మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తుంది. బీసీ రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేస్తుంది. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో ఓట్లు వేయించుకుని జంతరమంతర్ వద్ద ధర్నా పేరుతో కాంగ్రెస్ పార్టీ వేషాలు వేస్తుంది. అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలమై కప్పిపుచ్చుకునేందుకు నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.



# బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ డ్రామాలు : ఎంపీ వద్దిరాజు

న్యూఢిల్లీ,ఆగస్టు6(సమయజ్యోతి):




బీసీలను రిజర్వేషన్ల పేరుతో మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పూనుకున్నదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేసే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చింది అని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక దిక్కుతోచని స్థితిలో రేవంత్ రెడ్డి మంత్రిమండలిని, పార్టీ ఎమ్మెల్యేలను, బీసీ సోదరులను వెంటబెట్టుకుని వచ్చి జంతర్ మంతర్ వద్ద డ్రామా చేస్తుండు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలు, డ్రామాతో ఏ మాత్రం లాభం లేదు, బీసీలకు ఒరిగేదేమీ ఉండదు అని పేర్కొన్నారు. రాజ్యాధికారంలో మా న్యాయమైన వాటా కోసం, హక్కుల సాధనకు ఇటువంటి ధర్నాలు,ఉద్యమాలు ఎన్నో చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలినాళ్లలోనే మహానేత కేసీఆర్ మహిళలు, బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపారు. బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందంటే, సముచిత గౌరవం దక్కిదంటే అది కేసీఆర్ సుపరిపాలనలోనే అని పేర్కొన్నారు. మోసపు మాటలు చెప్పి, 432 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుండు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మున్నూరు కాపు, ముస్లిం, లంబాడ, రజక, యాదవ్, కుర్మ కులాల వారికి చోటు లేకపోవడం బాధాకరం. రేవంత్ రెడ్డి ఆదరాబాదరాగా బీసీ కులాల కార్పొరేషన్స్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర పూర్తయినా కూడా అణా పైస విడుదల చేయలే అని మండిపడ్డారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయడంలో చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీ పార్లమెంటులో గళమెత్తాలి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి. లోకసభ, రాజ్యసభల్లో కలిపి కాంగ్రెస్, ఇండియా కూటమికి 300 మందికి పైగా సభ్యులు ఉన్నారు, కేంద్రాన్ని ఒప్పించి బీసీ బిల్లు పెడితే బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుంది, రిజర్వేషన్స్ కు చట్టబద్ధత లభిస్తుంది అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.

# అందాల పోటీలు పెట్టడం కాదు

## స్త్రీలను గౌరవించండి : మెతుకు ఆనంద్

హైదరాబాద్,ఆగస్టు6(సమయజ్యోతి):



అందాల పోటీలు పెట్టామని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ముందు స్త్రీలు, మహిళా ప్రతినిధులను గౌరవించడం నేర్చుకోండి అని కాంగ్రెస్ నేతలను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సూచించారు. మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని బాలాపూర్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని ఉద్దేశ పూర్వకంగా అవమానించడం విచారకరం అని ఆయన పేర్కొన్నారు. తన నియోజక వర్గ ప్రజలకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రా రెడ్డి.. ప్రోటోకాల్ పాటించకుండా ఓడిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని వేదిక మీద కూర్చోబెట్టి, తనకు చోటు లేకపోవడంతో అధికారిక కార్యక్రమంలో ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నించినందుకు గాను స్థానిక ఎమ్మెల్యే, అందులోనూ మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా కాంగ్రెస్ కార్యకర్తలు సబితా ఇంద్రారెడ్డి మీదకు దూసుకురావడం కాంగ్రెస్ పార్టీలో మహిళలకు దక్కుతున్న గౌరవానికి నిదర్శనం అని మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఒక ఆడబిడ్డకు ఇంత అవమానం జరుగుతుంటే చూసి చూడనట్టు వ్యవహరించిన బాధ్యతరహిత మంత్రి శ్రీధర్ బాబు అని ఆనంద్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే అని చూడకుండా గతంలో కూడా నిండు సభలో కించపరిచారు. రాజ్యాంగపరమైన నియమాలకు అనుగుణంగా, సబితా ఇంద్రారెడ్డికి పూర్తి భద్రత కల్పించాల్సిన పోలీసులు కాంగ్రెస్ నాయకులకు భయపడి రక్షణ కల్పించలేకపోయారు. ప్రభుత్వం తరపున జరిగే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సైతం గాంధీ భవన్‌లో జరిగే రాజకీయ కార్యక్రమంలాగా కాంగ్రెస్ పార్టీ మార్చేసిందని ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం నాడు మాట్లాడుతూ.. అవకాశం వస్తే ఆడవారు ఏ రంగంలోనైనా రాణిస్తారని, రాజకీయాల్లోకి మహిళలు కూడా రావాలని పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ముందు మీరు మహిళలను గౌరవించండి. రాష్ట్రంలో అసెంబ్లీ సాక్షిగా, టీవీ చర్చా కార్యక్రమాల్లో, మీడియా సమావేశాల్లో మహిళల హుందాతనానికి భంగం కలిగించేలా మీరు వ్యాఖ్యానిస్తుంటే, మీ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు మిమ్మల్ని అనుసరిస్తూ.. మహిళలను ప్రత్యక్షంగా వేదికలపైన సైతం కించపరుస్తూ శునకానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు..

# ధరాలీలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

న్యూఢిల్లీ, ఆగస్టు6(సమయజ్యోతి):

ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలీ గ్రామంలో సంభవించిన జలప్రళయంలో ఇండ్లకు ఇండ్లే కొట్టుకుపోయాయి. ఆ ఇండ్ల స్థానంలో భారీగా బురద పేరుకుపోయింది. ప్రళయంలో ఇప్పటికే నలుగురు మరణించారు. దాదాపు 60 మంది గల్లంతయ్యారు. దాంతో గల్లంతైన వారి ఆచూకీ కోసం ఇండియన్ ఆర్మీ గాలిస్తోంది. మంగళవారం క్లౌడ్‌బస్ట్ కారణంగా ఖీర్ గంగా నది ఉప్పొంగింది. దాంతో నది పక్కనే ఉన్న ధరాలీ గ్రామాన్ని వరద ముంచెత్తింది. అకస్మాత్తుగా వచ్చిన వరదతో ఆ గ్రామంలో ఇళ్లకుఇళ్లే కొట్టుకుపోయాయి. పలు ఇళ్లను బురద కప్పేసింది. భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఊహించని జలప్రళయంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ విపత్తువల్ల ధరాలీ గ్రామానికి చెందిన దాదాపు 60 మంది గల్లంతయ్యారు. నలుగురు మృతిచెందారు. సమాచారం అందుకున్న ఆర్మీ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. బుధవారం కూడా రెస్క్యూ టీమ్స్ గాలింపులు కొనసాగిస్తున్నాయి.

# సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు కీలకతీర్పు

న్యూఢిల్లీ, ఆగస్టు6(సమయజ్యోతి):



సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోను వినియోగించే విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట కల్పించింది. జులై 31న ఇచ్చిన తన ఉత్తర్వులో సంక్షేమ పథకాల్లో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలను ఉపయోగించ కూడదని డీఎంకే ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ అయిన ఏఐఏడీఎంకే నాయకుడు సీవీ షణ్ముగంకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్ వీ అంజరియాలతో కూడిన ధర్మాసనం రూ.10 లక్షల జరిమానా విధించింది. తమిళనాడు సంక్షేమ పథకాలలో ముఖ్యమంత్రి పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ సరికాదని, చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోలను వినియోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు.. కొత్తగా తీసుకు రానున్న సంక్షేమ పథకాల్లో ప్రస్తుతం జీవించి ఉన్న నాయకుల పేర్లు వాడొద్దని.. పథకాలపై ప్రచారం చేసుకునే సమయంలో మాజీ సీఎంల ఫొటోలు, పార్టీ జెండాలను ఉపయోగించకుండా నిషేధం విధించింది. దీన్ని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఎన్నో రాష్ట్రాల్లో నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టారని.. దీనిపై ఎలాంటి న్యాయపరమైన నిషేధాజ్ఞలు లేవని ధర్మాసనం ఎదుట తమిళనాడు ప్రభుత్వం తెలిపింది. పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయంలో పిటిషనర్‌కు ఆందోళన ఉంటే.. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలతో ఉన్న పథకాలను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది. పలు పథకాలకు ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తుల ఫొటోలు ఉపయోగించు కోవచ్చని సుప్రీం గతంలో అనుమతి ఇచ్చిందని.. దేశ వ్యాప్తంగా ఇదే విధానాన్ని అను సరిస్తున్నారని.. రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేసు కోవద్దంటూ హెచ్చరిస్తూ పిటిషనర్‌కు రూ.10లక్షల జరిమానా విధించింది.

# పెళ్లైన ఐదునెలలకే నవ వధువు ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఆగస్టు6(సమయజ్యోతి):

కోటి ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన ఓ మహిళ.. పెళ్లైన ఐదు నెలలకే తనువు చాలించింది. భర్త వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. అయితే, భర్త మాత్రం తన భార్య ఆత్మహత్య చేసుకుందని చెప్తుండగా.. యువతి కుటుంబం మాత్రం కట్నం కోసం తమ బిడ్డను హింసించి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్నోకు చెందిన అనురాగ్ సింగ్ హాంకాంగ్‌కు చెందిన షిప్ మేనేజ్‌మెంట్ సంస్థలో సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మధు (32) అనే మహిళతో ఈ ఏడాది ఫిబ్రవరి 25న వివాహం జరిగింది. అయితే, వివాహం సమయంలో రూ.15 లక్షలు కట్నం డిమాండ్ చేసినట్లు యువతి తల్లిదండ్రులు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా యువతి ఫ్యామిలీ చూపించింది. పెళ్లి సమయంలో రూ.5 లక్షలు ఇవ్వగలిగినట్లు చెప్పారు. అయితే, పెళ్లైన తర్వాత అనురాగ్ తనకు కట్నం కోసం పదేపదే ఫోన్ చేసి ఒత్తిడి చేశాడని మధు తండ్రి ఫతే బహదూర్ సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లైన నెలలోపే తొలిసారి తన కూతురు మధుపై అల్లుడు అనురాగ్ దాడి చేశాడని, దీంతో ఆమె పుట్టింటికి తిరిగి వచ్చినట్లు చెప్పారు. అడిగిన కట్నం చెల్లించామని.. దీంతో బిడ్డను తిరిగి తీసుకెళ్లినట్లు వివరించారు. అయితే, తన కూతురిని హింసించడం మాత్రం ఆపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు అనురాగ్ వేరే అమ్మాయితో వివాహేతర సంబంధంలో ఉన్నాడని ఆరోపించారు. ఇటీవలే ఓ హోటల్‌లో తన మాజీ ప్రియురాలితో ఓ రాత్రి గడిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 31న హోటల్ బుకింగ్‌కు సంబంధించిన వివరాలను కూడా ఫిర్యాదులో పంచుకున్నారు. ఆగస్టు 3 ఆదివారం నాడు అనురాగ్ తనపై దాడి చేసినట్లు మధు తన అక్క ప్రియతో చెప్పినట్లు యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కూతురు గర్భవతి అని, తనను కడుపు తీయించుకోమని ఒత్తిడి చేసినట్లు చెప్పారు. 'ఆగస్టు 4న సాయంత్రం 4:32 గంటలకు అతను ఫోన్ చేసి నా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెప్పాడు. అతడే నా కూతురిని చంపాడని నేను అనుకుంటున్నాను' అని మధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు మధు అక్క ప్రియ మాట్లాడుతూ.. 'నా చెల్లి చాలా లైవ్‌లీ పర్సన్. కానీ అనురాగ్ మాత్రం ఆమె ఎవరితోనూ మాట్లాడటం ఇష్టపడేవాడు కాదు. స్నేహితులతో కూడా మాట్లాడనిచ్చే వాడు కాదు. ఆఖరికి మాతో కూడా మాట్లాడొద్దని చెప్పేవాడు. అతను ఊర్లో లేనప్పుడు మాత్రమే మేము మాట్లాడుకునే వాళ్లం. ఆమె ఫోన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేవాడు. ఎటువంటి కారణం లేకుండానే మా చెల్లిని కొట్టేవాడు. తనతో కలిసి డ్రింక్ చేయమని ఒత్తిడి తెచ్చేవాడు. చివరి సారిగా తనతో మాట్లాడినప్పుడు.. అనురాగ్ కొట్టినట్లు చెప్పింది. అప్పుడు తనని ఇంటికి తీసుకురావాలని అనుకున్నాను. కానీ మళ్లీ గొడవ జరుగుతుందనే భయంతో ఆగిపోయాను' అంటూ చెప్పుకొచ్చింది.

# ఓటర్ల లిస్టుపై వివరణ ఇవ్వండి : ఈసీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు6(సమయజ్యోతి):

బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిపిన ఎన్నికల కమిషన్ ఈనెల 1న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. 65 లక్షల మందిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్టు ప్రకటించింది. దీనిపై సుప్రీంకోర్టు బుధవారంనాడు ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలను ఆగస్టు 9వ తేదీలోగా తమకు సమర్పించాలని ఆదేశించింది. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌ను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ అనే ఎన్‌జీఓ గతంలో సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం మరోసారి కోర్టును అశ్రయించింది. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాను ఇచ్చినప్పటికీ ఓటర్ల తొలగింపునకు కారణాలు చెప్పలేదని ఎన్‌జీపీ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తమ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ, తొలగించిన ఓటర్ల జాబితా వివరాలు ఇప్పటికే రాజకీయ పార్టీలకు ఇచ్చినందున ఆ వివరాలను ఎన్‌జీవోకు కూడా అందించాలని ఈసీ తరపు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం జాబితా వివరాలను అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వివరిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# హైదరాబాద్‌లో డికె శివకుమార్

## మర్యాదపూర్వకంగా కలిసిన రాజగోపాల్

హైదరాబాద్,ఆగస్ట్6(సమయజ్యోతి):

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో బస చేసిన డికెతో ఓ ప్రైవేట్ హోటల్లో.. భేటీ అయ్యారు. రాజగోపాల్ రెడ్డి, డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అయితే తాజాగా రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని తెలిపారు. కాంగ్రెస్‌లో తనని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని కుండబద్దలు కొట్టారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగాని-కై-నా రెడీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే గత కొన్నిరోజులుగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై రాజగోపాల్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్, రాజగోపాల్ రెడ్డిల భేటీ- ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే గురువారం డీకే శివకుమార్, సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు- సమాచారం.

# సంధ్యథియేటర్ తొక్కిసలాట ఘటన

## తెలంగాణ సిఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసు

హైదరాబాద్,ఆగస్ట్6(సమయజ్యోతి):

అల్లు అర్జున్ పుష్ప-2' సినిమా విడుదల సందర్భంగా హీరో అల్లు అర్జున్ అతిథిగా వచ్చారు. దీంతో తమ అభిమాన హీరోను చూస్తేందుకు వేల సంఖ్యలో ఫ్యాన్స్ అక్కడకు వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి.. ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. తాజాగా ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ సిఎస్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సంధ్య థియేటర్ ఘటన దర్యాప్తుపై ఎన్‌హెచ్‌ఆర్‌సి అసహనం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీసులు సమర్పించిన నివేదికపై అసంతృప్తి తెలిపింది. బాధిత కుటు-ంబానికి పరిహారం రూ.5 లక్షలు ఇచ్చేలా ఆదేశాలు ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలని కమిషన్ అడిగింది. షోకు పోలీసులు అనుమతి లేదని రిపోర్టులో తెలిపారని.. అనుమతి లేకుంటే నటు-డు, అభిమానులు ఎందుకు వచ్చారో తెలియట్లేదు అని పేర్కొంది. ముందే చర్యలు తీసుకుంటే తొక్కిసలాట జరిగేది కాదని తెలిపింది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఆరు వారాల్లో మరో నివేదిక ఇవ్వాలని.. దర్యాప్తు నిష్పక్షపాతంగా చేయాలని హైదరాబాద్ సిపికి ఆదేశాలు జారీ చేసింది.

# తెలంగాణ రిజర్వేషన్ పోరాటానికి మా మద్దతు

## మహాధర్నాకు హాజరై సంఘీభావం ప్రకటించిన కనిమొళి

న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి డీఎంకే మద్దతు ఇస్తోందని ఆ పార్టీ ఎంపీ కనిమొళి అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ కోటా కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర జరుగుతోన్న మహాధర్నాకు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన కనిమొళి.. రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు అన్ని స్థాయిల్లో తమ మద్దతు ఉంటుం దన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ పోరాటంలో తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్‌కు డీఎంకే మద్దతు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఒక పెద్ద తప్పును సరి చేస్తోందన్నారు. బీజేపీ పాలిత రాష్టాల్లో కేంద్రం అభివృద్ధిని అడ్డుకుం టోందని విమర్శించారు. ప్రజల యోగక్షేమం కోసం తాము ఎల్లప్పుడూ మద్దత్తుగా ఉంటామన్నారు. రిజర్వేషన్ల పరిమితిని తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు కనిమొళి.. తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నా యని చెప్పారు. పెరియార్ కాలం నుంచి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ ఉందన్నారు. దేశంలో పోరాటం చేసి రిజర్వేషన్లు పెంచుకున్న ఏ-కై-క రాష్ట్రం తమిళనాడు అని తెలిపారు. పార్లమెంటు-లో కూడా ఈ అంశంపై తెలంగాణ ఎంపీలు చేసే పోరాటానికి డీఎంకే మద్దతు ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను కేంద్రం ఆమోదించాలనే డిమాండ్ తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఆగస్టు 6న జంతర్‌మంతర్ దగ్గర మహా ధర్నా నిర్వహిస్తోంది. ఇప్పటికే డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు- మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీలోని బీసీ నేతలు, బీసీ సంఘాల నాయకులంతా హాజరయ్యారు.



# రిజర్వేషన్లపై అవగాహన లేని బిజెపి

## రిజర్వేషన్ల ధర్నాతో బిజెపి కళ్లు తెరవాలి

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

న్యూఢిల్లీ,ఆగస్ట్6(సమయజ్యోతి):

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం జంతర్ మంతర్ చలో ఢిల్లీ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణఅన్నారు. ఈ ధర్నాతో బిజెపి కళ్లు తెరవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం తమ పోరాటం ఆగబోదన్నారు. ఈ మహాధర్నాకు 50 మంది కాంగ్రెస్ ఎంపీలు మద్దతిచ్చారని చెప్పారు. బీజేపీకి రిజర్వేషన్లు అంశంలో క్లారిటీ లేదన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఇస్తూ.. తెలంగాణలో అడ్డుకుంటాం అంటు న్నారని ఫైర్ అయ్యారు. రిజర్వేషన్ల కోసం తమపోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ బీజేపీ నేతలకు రిజర్వేషన్లపై క్లారిటీ లేదన్నారు. బీసీలకు రిజర్వేషన్ ఇస్తే అడ్డుకుంటామని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. బీజేపీ తెలంగాణ నేతలు పార్టీ సమావేశాలు పెట్టుకుని రిజర్వేషన్ అంశాల్లో క్లారిటీ- తీసుకోవాలని సూచించారు. ప్రజలకు బీసీలకు ఏ విధంగా న్యాయం చేయాలో బీజేపీ నాయకులు ఆలోచన చేయాలన్నారు. బీసీలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను కేంద్రం ఆమోదించాలనే డిమాండ్ తో సీఎం రేవంత్ ÷డ్డి నేతృత్వంలో ఆగస్టు 6న జంతర్‌మంతర్ దగ్గర మహా ధర్నా జరుగుతోంది. ఇప్పటికే డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ హేశ్ కుమార్ గౌడ్ తో పాటు- మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీలోని బీసీ నేతలు, బీసీ సంఘాల నాయకులంతా హాజరయ్యారు.



# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఆర్టీఏ

జగిత్యాల, ఆగస్టు6(సమయజ్యోతి):

తమ విధులను సక్రమంగా నిర్వర్తించటానికి కొందరు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు పక్కా వల పన్ని ఓ అధికారిని పట్టుకున్నారు. మరికొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్న ఓ జిల్లా అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీక చిక్కారు. జగిత్యాల జిల్లాలో జరిగిన ఘటన వివరాలు.. జిల్లా రవాణాశాఖాధికారి భద్రునాయక్ ఈనెల 31న రిటైర్‌మెంట్ కాబోతున్నారు. అయితే పట్టుకున్న జేసీబీని విడిచిపెట్టేందుకు శశిధర్ అనే వ్యక్తి అధికారిని ఆశ్రయించాడు. ఇద్దరి మధ్య చివరకు రూ. 22 వేలు లంచంగా తీసుకునేందుకు డీటీవో అంగీకారం చేసుకున్నాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా బుధవారం జగిత్యాల రవాణాశాఖ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేశారు. డీటీవో వద్ద లభించిన రూ.22 వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



# హాస్పిటల్ ఖర్చుల రీఫండ్ పేరిట 15 లక్షల రూపాయల మోసానికి పాల్పడ్డ నిందితుడికి రిమాండ్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

తెలుగు రాష్టాల్లో కలసి ఎన్సీఈఆర్పి పోర్టల్ 79 పిటీషన్ల మేరకు 15 లక్షల రూ.ల మోసానికి పాల్పడ్డ నిందుతుడు కడప జిల్లా జమ్మలమడుగు భాగ్యనగర్ కాలనీకి చెందిన ముల్లుంటి సలీం మాలిక్(32), హైదరాబాద్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా సైబర్ బృందం పట్టుకున్నట్లుగా సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య శాఖ నుండి మాట్లాడుతున్నామంటూ బాధితులకు కాల్స్ చేస్తూ హాస్పిటల్ ఖర్చుల రీఫండ్ చేస్తామని చెప్పి బాధితులకు మొబైల్ నుండి కాల్ చేసి వారిని ఒక లింక్ పంపించి ఆ లింకు ఓపెన్ చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే మీకు మీ ఆరోగ్యశ్రీలో ఖర్చయిన డబ్బులు తిరిగి మీ అకౌంట్లో క్రెడిట్ అవుతాయని చెప్పగా బాధితులు నమ్మి ఆలింక్ క్లిక్ చేసి లింక్ లో యూపీఐ పిన్ ఎంటర్ చేయడం ద్వారా డబ్బులు కోల్పోవడం జరిగింది. దీంట్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముస్తాబాద్ మండలంలో ఒక బాధితుడు, వేములవాడ టౌన్ పరిధిలో ఒక బాధితుడు మోసపోయారు. ముస్తాబాద్ అతను 46 వేలు, 10 వేలు నష్టపోవడం జరిగింది. ఈ ఘటనలపై ఎస్పీకి ఫిర్యాదు అందడంతో, ఆయన విచారణకు ఆదేశించారు.సీఐ మొగిలి, ఎస్సై గణేష్, సైబర్ టీం ఆర్.ఎస్.ఐ జునైద్, సిబ్బంది కిట్టు గంగారెడ్డి, ముస్తాబాద్ కానిస్టేబుల్ కాసిం టీమ్ గా ఏర్పడి సాంకేతికత ఆధారంగా నిందుతుణ్ణి అరెస్ట్ చేసి, రిమాండ్ చేయడం జరిగిందన్నారు.



# ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద పిసిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో రిజర్వేషన్ల పోరుబాట

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

42 శాతం రిజర్వేషన్ల కొరకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బుధవారము తెలంగాణా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమంలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి తో పాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యే భూపతి రెడ్డి, నిజామాబాద్ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మినరల్ డెవలప్మెంట్ చైర్మన్ ఈరావత్రి అనిల్, పిసిసి ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, క్రమశిక్షణ కమిటీ మెంబర్ రామకృష్ణ, సీనియర్ నాయకులు రత్నాకర్, మునిపల్లె సాయిరెడ్డి, ఈసా, సుమన్, సకినాల శివకుమార్, ఆకుల మహేందర్, బింగి మధు సుధాన్ పాల్గొన్నారు.




# బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించి తీరుతాం" జంతర్ మంతర్ లో తెలంగాణ కాంగ్రెస్ ధర్నా

**ఢిల్లీ, ఆగస్టు 6, 2025:**

బీసీలకు విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం భారీ ధర్నా నిర్వహించింది. బీసీ సంక్షేమ సంఘం మద్దతుతో జరిగిన ఈ నిరసనలో బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేయాలని, దాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం గల్లీ నుంచి ఢిల్లీ వరకు వ్యాప్తి చెందిందని, ఈ లక్ష్యాన్ని సాధించకుండా విడిచిపెట్టబోమని పేర్కొన్నారు. బీజేపీ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే ఆ పార్టీకి, ఆ పార్టీ బీసీ నాయకులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తతాయని ఆయన హెచ్చరించారు.ధర్నాలో తెలంగాణ నుండి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ సార్ జయంతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని మందమర్రి మున్సిపాలిల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ తుంగపిండి రాజలింగు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతు నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షకు ప్రపంచానికి చాటిన మహా జ్ఞాని, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులని అన్నారు. ఈనాటి యువత జయశంకర్ సార్ పోరాటం స్ఫూర్తి తీసుకొని ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ టి రాజేశ్వరి, రెవెన్యూ ఆఫీసర్ పి కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు బి శ్రీనివాస్, డి మహేష్, వెంకటేష్, శ్రీకర్, పూర్ణచందర్, రాజశేఖర్, ఎం గోపికృష్ణ, బి శ్యాంబాబు, ఎంఎ సమీర్, రఘురాం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ధర్నా నిర్వాహకులకు మొహమ్మద్ అలీ షబ్బీర్ ధన్యవాదాలు

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

బీసీ రిజర్వేషన్ కు పోరాడుతున్న రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీ ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. బీసీ రిజర్వేషన్ అనేది మతాలకు అనుగుణంగా కాకుండా మైనార్టీలో వెనుకబడిన వారికి మాత్రమే వర్తింప చేసే విధంగా ఉందని తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం, కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అనుగుణంగా, సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే మొదటిసారిగా కులగణన చేసి, అసెంబ్లీలో తీర్మానం చేసి, గవర్నర్ కు పంపించారని అన్నారు. బిజెపి మోసాన్ని దేశానికి తెలపడానికి, బిసి రిజర్వేషన్ల అమలు చేసేందుకు ఏర్పాటు చేసిందని అన్నారు.



# పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూరు పట్టణం కృష్ణవేణి టాలెంట్ పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ మినాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహణ, వ్యర్థాల డంపు యార్డ్ సందర్శన, అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎ. రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, డైరెక్టర్లు కర్తన్ విజయ్ కుమార్, జి. నాగేశ్వర్ రావు, మొహ్సిన్ జబ్రీ పాల్గొన్నారు.



# ప్రొ.జయశంకర్ జయంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారము ఇన్చార్జి హెచ్ఎం ఆధ్వర్యంలో ప్రొ.జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల సమర్పించి, నివాళులు అర్పించారు.



# వనమహోత్సవంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

## నాటిన మొక్కలను అందరూ కాపాడుకోవాలి-బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**సమయజ్యోతి న్యూస్ ఆగస్టు 06 బజార్ హత్నూర్**

నేరడిగోండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసి వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన హరితహార కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో మండల కేంద్రంలో గల జూనియర్ కళాశాలలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్.జాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ విద్యార్థులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటిన మొక్కలను ప్రతీ ఒక్కరూ కాపాడుకోవాలని పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని అన్నారు. అనంతరం పాఠశాల లెక్చరర్లు ఎమ్మెల్యే కి సన్మానించి కళాశాలలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. వీరి వెంట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# పార్టీ ఆదేశాల మేరకు పనిచేశా

## ఫామ్‌మౌజ్‌లో వందకోట్లకు అమ్ముడుపోలే

## ప్రజలను మరచి విన్యాసాలు చేస్తున్న పార్టీలు

## మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సంచలన వ్యాఖ్యలు

**నాగర్ కర్నూలు,ఆగస్ట్ 6(సమయజ్యోతి):**

గతంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఏం ఆదేశిస్తే అదే తాను చేశానని బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు.. ఆ పార్టీపై సంచలన వ్యాఖలు చేశారు. పేదరిక నిర్మూలన.. ప్రజల పక్షమే తన పంతమని పేర్కొన్నారు. తనకు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అది నాయకత్వం నుంచి పిలుపు వచ్చిందన్నారు. కానీ తన వాయిస్ ప్రజల పక్షాన బతికి ఉండాలంటే.. స్వేచ్ఛ ఉన్న పార్టీ తనకు కావాలని పేర్కొన్నారు. తొందరలో తన దారి ఏమిటో నిర్ణయిస్తానని స్పష్టం చేశారు. బుధవారం నాగర్ కర్నూలులో గువ్వల బాలరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. అసమర్థ నాయకత్వం కుట్రలు చేసి తనను ఓడించిందంటూ బీఆర్ఎస్ పార్టీపై మండిపడ్డారు. అన్యాయాన్ని ఎదిరించే పాత్రను ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ పోషించడం లేదన్ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలకు కష్టకాలంలో పార్టీ అధినాయకత్వం అండగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఏమి ఆశిస్తున్నారో అది చేయకుండా.. అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం చేసుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జీబీఆర్ రూ. 100 కోట్లకు అమ్ముడు పోలేదని స్పష్టం చేశారు. గువ్వల బాలరాజు అంటేనే ఒక సెన్సేషన్..జీబీఆర్ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడకూడదంటే ఒప్పుకోడంటూ తన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కుండ బద్దలు కొట్టారు. తనతో కలిసి రవాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితికి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆగస్ట్ 4వ తేదీ అంటే సోమవారం రాజీనామా చేశారు.

# అమరచింత లో ఘనంగా ప్రొపెసర్ జయశంకర్ జయంతి వేడుకలు.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

తెలంగాణ పితామహుడు కొత్తపల్లి జయ శంకర్ జయంతి వేడుకలను బి. ఆర్. ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా బి. ఆర్. ఎస్. పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కల నర్సిములు గౌడ్ జయ శంకర్ విగ్రహనికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకోని పోదామని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ అలుపెరుగనిపోరాటం చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్. ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, మాజీ సర్పంచ్ ఎల్. గోపాల్ నాయక్,బి. ఆర్. ఎస్ పార్టీ సినియర్ నాయకులు షన్వాజ్ ఖాన్,తోకలి రమేష్, హొటల్ రాజేష్,జింక రవి, ఎస్. రఘు,ఎస్. జె. రాజు, కప్పల నాగరాజు, జలెంధర్,నిమ్మకాయల అల్లీ, ప్రేమ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించిన మండల విద్యాధికారి నిజాముద్దీన్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ నారాయణ పేట జిల్లా**

మండలంలోని గుడేబల్లూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడి సెంటర్లో ప్రీ ప్రైమరీ పాఠశాలను మండల విద్యాధికారి నిజాముద్దీన్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్ బుధవారం ప్రారంభించారు. విద్యాధికారి నిజాముద్దీన్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రీ ప్రైమరీ లో చేర్చాలని అంగన్వాడి టీచర్స్ ను కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నర్సమ్మ, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, ఉపాధ్యాయులు సుష్మ,కళ్యాణి,రిషిక శోభ,సి ఆర్ పి అమిన్ రెడ్డి, ఏపీవో బస్వరాజ్,అంగన్వాడీ టీచర్స్ కమలమ్మ, హనుమంతమ్మ పాల్గొన్నారు.



# విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించిన సైబర్ డి.ఎస్.పి హసీబ్ ఉల్లాహ్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోగల బంగారి గూడ లోని మోడల్ స్కూల్ యందు బుధవారం సైబర్ డి.ఎస్.పి హసీబ్ ఉల్లాహ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డిఎస్పి హసీబ్ ఉల్లాహ్ మాట్లాడుతూ రోజు రోజుకి ఆధునిక సమాజంలో సైబర్ క్రైమ్ నేరస్తులు నూతన పద్ధతులను ఉపయోగిస్తూ అమాయకుల వద్ద డబ్బులు దోచుకుంటున్నారని చెప్పారు.అవగాహన,అప్రమత్తతతోనే వాటిని అరికట్టవచ్చని ఆయన అన్నారు.సైబర్ క్రైమ్ కు గురైనట్లు తెలిసిన వెంటనే 1930 నెంబర్ కి కాల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ బాధితులు డబ్బును పోగొట్టుకున్న ఎడల గోల్డెన్ అవర్ అనగా ఒక గంటలోపు సంప్రదించినట్లయితే ఎక్కువ మొత్తం డబ్బులను బ్యాంకుల నందు హోల్డ్ చేసి వాటిని తిరిగి అందించే విధంగా కృషి చేయవచ్చని తెలిపారు.బాధితులు గంటలోపు ఫిర్యాదు చేస్తే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. సోషల్ మీడియా నందు వేధింపులు, బ్యాంకు పేరుతో అనుమానిత లింక్స్,ఏపీకే ఫైల్స్, క్యూఆర్ కోడ్ తో మోసం,కేవైసీ అప్డేట్ చేయడానికి మీ బ్యాంక్ అకౌంట్ నెంబర్ క్రెడిట్ డెబిట్ కార్డు నెంబర్ సి వి వి మరియు ఓటీపీ నంబర్ చెప్పమని అడుగుతారన్నారు.బ్యాంకు ద్వారా ఎలాంటి లింక్స్,ఏపీకే ఫైల్స్ పంపరని చెప్పారు.అనుమానం వస్తే బ్యాంకు వెళ్లి తెలుసుకోవాలన్నారు.ఉచిత బహుమతి,జాబ్ మోసం, ఎక్కువ లాభాలు వస్తాయని పెట్టుబడి మోసం,మొబైల్ హ్యాకింగ్,ఆన్లైన్ గేమ్స్,బిజినెస్ ఫ్రాడ్,ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్,స్టాక్ మార్కెట్ ఫ్రాడ్,క్రికెట్ కార్డ్ ఫ్రాడ్,లోన్ ఫ్రాడ్,డూప్లికేట్ వస్తువులు పంపుతూ ఆన్లైన్ షాపింగ్ మోసం,తప్పుడు ప్రకటనలతో వివిధ చార్జీల కింద డబ్బులు వసూలు లాంటి మోసాలను మార్కెట్లో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు.విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన,తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై పరీక్షను నిర్వహించారు.కార్యక్రమంలో సైబర్ టీం,స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,లెక్చరర్స్,విద్యార్థినీ,విద్యార్థులు,స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.






# భారతదేశంలో 20 ఏళ్ల గౌరవయాత్రను పూర్తి చేసిన టయోటా ఇన్నోవా

**బెంగళూరు, ఆగస్టు 2025: సమయజ్యోతి**

భారతదేశంలో విశ్వాసానికి మరోపేరు గా నిలిచిన టయోటా ఇన్నోవా, ఇప్పుడు 20 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ఈ సందర్భాన్ని ఘనంగా జరుపుకుంటోంది. ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 12 లక్షలకుపైగా వాహనాలు విక్రయమవడం ఈ మోడల్ విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచింది. ఇన్నోవా, ఇన్నోవా క్రైస్టా, మరియు హైక్రాస్ మోడళ్లతో వినియోగదారులకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తూ, ఈ వాహనం కుటుంబాలు, వ్యాపార అవసరాల కోసం ఒక విశ్వసనీయ ఎంపికగా మారింది.

విస్తృతమైన అంతర్గత భాగాలు, బలమైన శరీర నిర్మాణం, మృదువైన డ్రైవింగ్ అనుభవం ద్వారా ఇన్నోవా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది.టయోటా సంస్థ విక్రయాలు మరియు సేవల విభాగం ఉపాధ్యక్షుడు శ్రీ వరీందర్ వాధ్వా మాట్లాడుతూ, "ఇన్నోవా వాహనం కుటుంబాలకు ఓ నమ్మకమైన భాగస్వామిగా మారింది. ప్రతి పర్యటనను సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది" అన్నారు.2005లో ప్రారంభమైన ఇన్నోవా ప్రయాణం, భారత వాహన రంగంలో ఒక దిశానిర్దేశక మోడల్‌గా నిలిచింది. 2016లో విడుదలైన ఇన్నోవా క్రైస్టా కొత్త రూపకల్పన, అధిక శక్తి సామర్థ్యం, సౌకర్యాల ఆధారంగా మరింత ప్రజాదరణ పొందింది. ఇన్నోవా కథనం కేవలం సంఖ్యల మించినది. ఇది లక్షలాది భారతీయ కుటుంబాల కలల ప్రయాణాలకు, జ్ఞాపకాలకు ఒక భాగస్వామిగా మారిన వాహనం. ఈ మోడల్, నాణ్యత, దీర్ఘకాలికత, నమ్మకతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుదవారం జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని,అదే ఆయనకు మనం అందించే నిజమైన ఘన నివాళి అని పిలుపునిచ్చారు.



# శ్రీ గాయత్రి మాత ఆలయ వార్షికోత్సవం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము తెర్లుమద్ది గ్రామంలోని శ్రీ గాయత్రి మాత దేవాలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ రాయప రాజు ఆధ్వర్యంలో 19వ వార్షిక పూజా మహోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు దేవతామూర్తులకు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, ధూప దీపాలు, నైవేద్యాలు సమర్పణ చేశారు. పురస్త్రీలు భారీగా తగిలి వచ్చి గాయత్రి మాతకు ఒడి బియ్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



# నల్ల బ్యాడ్జీలు ధరించి అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్ డ్యూటీలు చేయాలి

## అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. జయలక్ష్మి

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణ పేట జిల్లా**



అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి డ్యూటీ లు చేయాలనీ అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి బుధువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుండి ప్రతి అంగన్వాడీ టీచర్, హెల్పర్ ప్రతిరోజు నల్ల బ్యాడ్జిలు ధరించి, ప్రీస్కూల్ పిల్లలకు కూడా పెట్టాలి అని అన్నార అదేవిధంగా ఆగస్టు18 కలెక్టర్ ఆఫీస్ ల ముందు ధర్నాల కార్యక్రమం వరకు ఈ బ్యాడ్జీలు పెట్టుకొని డ్యూటీలు చేయాలి అని కోరారు.అలాగే ఫోటోలు దిగి విస్తృతంగా ప్రచారంలో పెట్టాలి. వాట్సప్ స్టేటస్, గ్రూప్స్, ఫేస్ బుక్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. ఎక్కడికక్కడ పత్రిక ప్రకటనలు కూడా ఇవ్వాలి అని తెలిపారు.

# గడపగడపకు బిజెపి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

మహా సంపర్క్ అభియాన్ గడపగడపకు బిజెపి కార్యక్రమంలో భాగంగా అమరచింత మున్సిపల్ లోని 8 వ, వార్డులో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి సుధీర్ కుమార్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజలకు కరపత్రల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వారి తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అములు చేస్తున్న సంక్షేమ పథకాలలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సబ్సిడీ బియ్యంలో కేంద్రం ప్రభుత్వం వాటా ఉందని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ళ నిర్మాణం కోసం ఆర్థిక సాయన్ని అందిస్తున్నామని అన్నారు. దేశం కోసం, ధర్మం కోసం బిజెపి పాటుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు తిరుమల లడ్డు సత్యనారాయణ, బిజెపి నాయకులు రవికుమార్, సాయి, హుస్సేన్, అఖిల్, దేవరకొండ పాండు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# నేడు జాతీయ చేనేత దినోత్సవం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఈనెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం గురువారం ఉదయం 09.30 లకు సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద నేతన్న విగ్రహానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేస్తారని, ఉదయం 10:00 గంటలకు వేములవాడలోని చేనేత సహకార సంఘం నుండి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు "చేనేత నడక" (చేనేత వాక్) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11:00 గంటలకు వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సమావేశం చేపట్టనున్నట్లు ఏడీ తెలిపారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మెన్స్)లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ అదిలాబాద్ :**

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో బుధవారం రోజు ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతి వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతీక్ బేగం అధ్యక్షత వహించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని సైతం త్యాగం చేశారని ఆమె తెలియజేశారు.ఈ వేడుకల్లో ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ యాకుబ్ అలీ,ఎన్సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు,విద్యార్థులు ఇతర బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



# 2025-26 విద్యా సంవత్సర ఇన్వెస్టీచర్ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా ఆదిలాబాద్,బంగారి గూడ లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ గర్ల్స్-1లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టీచర్ వేడుకలను బుధవారం ఎంతో ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన విద్యార్థి మండలి సభ్యులు,నాయకులను అధికారికంగా ప్రకటించారు.ఇది పాఠశాల యువ నాయకులుగా వారి ప్రయాణానికి నాంది పలికింది.ఈ సందర్భంగా విద్యార్థుల మార్చి పాస్ట్ బృందం అతిథులందరినీ హృదయపూర్వకంగా స్వాగతించింది.తరువాత ప్రార్థన గీతం,స్వాగత ప్రసంగం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.జిల్లా కలెక్టర్ ఈ వేడుకలో కొత్తగా ఎన్నికైన హెడ్ గర్ల్,అసిస్టెంట్ హెడ్ గర్ల్,స్పోర్ట్స్ కెప్టెన్లు,నలుగురు హౌస్ కెప్టెన్లకు సాషెస్,బ్యాడ్జిలను ప్రదానం చేశారు.ప్రతి విద్యార్థి నాయకురాలిని ప్రిన్సిపాల్ చేత ప్రమాణం చేయించారు.నిజాయితీ,విధేయత అంకితభావంతో సేవ చేస్తానని అందరు ప్రతిజ్ఞ చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తోటివారికి ఆదర్శంగా ఉండాలని,ఆరోగ్యంతో పాటు చదువు,కెరీర్‌పై దృష్టి పెట్టాలని,దేశానికి ఆదర్శంగా ఉండాలని తెలిపారు.నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ వంటి క్రీడాకారులను గుర్తుచేస్తూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.





# శుభమన్ గిల్‌కు ఐసీసీ అరుదైన గౌరవం

టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచిన గిల్, ఇప్పుడు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఇది అతనికి నాలుగోసారి ఈ అవార్డు గెలుచుకునే అవకాశం వచ్చింది. జూలై 2025కు గాను ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ముగ్గురు ఆటగాళ్లు నామినేట్ అయ్యారు. ఈ జాబితాలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తో పాటు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ ఉన్నారు.జూలై నెలలో శుభ్‌మన్ గిల్ ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌లలో 94.50 సగటుతో ఏకంగా 567 పరుగులు చేశాడు. ఇందులో బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 269, రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేశాడు. అంతేకాకుండా, నాలుగో టెస్టులో 103 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రా చేయడంలో కీలక పాత్ర పోషించాడు. గిల్ ఇప్పటికే మూడు సార్లు (జనవరి 2023, సెప్టెంబర్ 2023, ఫిబ్రవరి 2025) ఈ అవార్డును గెలుచుకున్నాడు. ఇప్పుడు నాలుగోసారి ఈ అవార్డును అందుకోవాలని ఆశిస్తున్నాడు. సౌతాఫ్రికాకు చెందిన ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల్లో అతను 265.50 సగటుతో 531 పరుగులు చేశాడు. మొదటి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 147 పరుగులు, రెండో టెస్టులో కెప్టెన్‌గా 367 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టెస్ట్ క్రికెట్‌లో సౌతాఫ్రికా తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి 7 వికెట్లు పడగొట్టాడు. అతని అద్భుతమైన ఆల్‌రౌండర్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా అందుకున్నాడు.ఇంగ్లాండ్ టెస్ట్ టీమ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా ఈ అవార్డుకు నామినేట్ అయ్యాడు. జూలైలో భారత్‌తో ఆడిన మూడు టెస్టుల్లో స్టోక్స్ 50.20 సగటుతో 251 పరుగులు చేసి, 26.33 సగటుతో 12 వికెట్లు తీశాడు. లార్డ్స్, మాంచెస్టర్ టెస్టుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను కూడా గెలుచు కున్నాడు. ఈ ముగ్గురిలో ఎవరు ఈ నెల అవార్డును గెలుచుకుంటారో చూడాలి.



# టీమిండియాలో ఊహించని మార్పులు

## జట్టు సారథ్య బాధ్యతలపై ఉత్కంట

ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ డ్రా అయిన తర్వాత టీమిండియా నెక్ట్స్ టార్గెట్ ఆసియా కప్ 2025. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుండి 28 వరకు యూఏఈలో జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కోసం భారత జట్టులో ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి? ఏయే ఆటగాళ్లకు అవకాశం లభిస్తుంది? సూర్యకుమార్ యాదవ్, బుమ్రా వంటి సీనియర్లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉందనే వార్తలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఆసియా కప్ 2025 కోసం టీమిండియా సన్నద్ధమవుతోంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ నెలలో యూఏఈలో జరగనుంది. భారత్ గ్రూప్ %ూ%లో పాకిస్థాన్, యూఏఈ, ఒమాన్‌తో కలిసి ఉంది. ఈ టోర్నమెంట్ కోసం భారత జట్టులో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవల హెర్నియా సర్జరీ చేయించుకున్నాడు. అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సూర్యకుమార్ యాదవ్ ఆసియా కప్‌లో ఆడే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. అతనితో పాటు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. వీరిద్దరూ టీ20 వరల్డ్ కప్ కోసం సన్నద్ధం కావాల్సి ఉండటంతో, సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకోవచ్చు. సూర్యకుమార్ యాదవ్ గైర్హాజరీలో, జట్టు సారథ్య బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో యువ ఆటగాళ్లైన శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ ఆసియా కప్ జట్టులో తమ స్థానాలను పదిలం చేసుకునే అవకాశం ఉంది. స్థిరంగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్ కూడా జట్టులో చోటు దక్కించుకోవచ్చు. కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో యువ బ్యాట్స్‌మెన్లు సంజు శాంసన్, తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్, రింకూ సింగ్లకు కూడా చోటు లభించవచ్చు. ఆల్ రౌండర్ల విషయంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్లకు బాధ్యతలు అప్పగించవచ్చు. పేస్ బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ వంటి యువ పేసర్లు ఉండవచ్చు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలకు అవకాశం ఉంది. వరుణ్ చక్రవర్తి టీ20ల్లో తిరిగి వచ్చిన తర్వాత అద్భుతంగా రాణించాడు.

# ఆసియా కప్ కోసం భారత్ జట్టు:

బ్యాట్స్‌మెన్లు: యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, శ్రేయాస్ అయ్యర్, తిలక్ వర్మ, రింకూ సింగ్.వికెట్ కీపర్లు: సంజు శాంసన్, ధ్రువ్ జురెల్. ఆల్ రౌండర్లు: హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్.బౌలర్లు: ప్రసిద్ధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, మహ్మద్ సిరాజ్.



# మహమ్మద్ సిరాజ్‌కు ఘన స్వాగతం

ఇంగ్లండ్ పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఘనస్వాగతం లభించింది. బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. భారీ ఎత్తున విమానాశ్రయానికి చేరుకున్న అభిమానులు.. సిరాజ్ భాయ్ సిరాజ్ భాయ్ అని గట్టిగా అరుస్తూ వెల్‌కమ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టల సిరీస్‌లో సిరాజ్.. 185.3 ఓవర్లు వేసి 23 వికెట్లతో సత్తా చాటాడు. ఓవల్ వేదికగా ఐదు రోజుల పాటు ఉత్కంఠగా సాగిన ఆఖరి పోరులో మహమ్మద్ సిరాజ్(5/104) అద్వితీయమైన బౌలింగ్‌తో టీమిండియాను గెలిపించాడు.374 పరుగుల లక్ష్యచేధనలో 339/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్.. సిరాజ్ ధాటికి 367 పరుగులకు ఆలౌటైంది. ఆఖరి రోజు ఆటలో ఇంగ్లండ్ విజయానికి 35 పరుగులే అవసరమవ్వగా.. సిరాజ్ సంచలన ప్రదర్శనతో జెమీ స్మిత్, జెమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్‌లను పెవిలియన్ చేర్చాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనతోనే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. మహమ్మద్ సిరాజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే యోచనలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఉంది. ఈ విషయాన్ని హెచ్‌సీఏ ప్రతినిధులు మీడియాకు తెలిపారు. 'మేం ఇంకా సిరాజ్‌తో మాట్లాడలేదు. కానీ మేం అతని కోసం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాం. అతను మరికొద్ది రోజులు హైదరాబాద్‌లోనే ఉండే అవకాశం ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో దేశం తరఫున మెరుగైన ప్రదర్శన చేయడం మా అందరికీ గర్వకారణం'అని హెచ్‌సీఏ ప్రతనిధులు తెలిపారు.





# భరత్ విజయంపై బుమ్రా ఆనందం


అంతగా అనుభవం లేని యువ జట్టుతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమిండియా అద్భుతమైన ఫలితాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఐదు టెస్టుల సిరీస్ ను 2-2తో సమం చేసింది. తాజాగా ఈ విజయంపై భారత స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా ఆనందం వ్యక్తం చేశాడు. సుదీర్ఘమైన ఈ టెస్టు సిరీస్ ఎన్నో మధురానుభుతులను నింపిందని పేర్కొన్నాడు. చాలా కఠినమైన, పోటీతత్వంతో కూడిన ఈ సిరీస్ ద్వారా ఎంతో నేర్చుకున్నమాని సోషల్ మీడియా వేదిక ఇన్ స్టాగ్రామ్ లో పోస్టు చేశాడు. అనంతరం నెక్ట్స్ ఏంటి..? అని సరదాగా అభిమానులను ప్రశ్నించాడు. చాలా మంది యువకులతో కూడిన టీమిండియాలో బుమ్రాతోపాటు కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మాత్రమే అంతర్జాతీయ టెస్టుల్లో సుదీర్ఘ అనుభవం ఉండగా, మహ్మద్ సిరాజ్ కు కాస్త ఎక్స్ పిరీయిన్స్ ఉంది. అయినప్పటికీ, కఠినమైన ఇంగ్లాండ్ గడ్డపై ఆ జట్టును సవాలు చేసి, దాదాపు ప్రతి టెస్టులో ఇండియానే డామినేట్ చేసింది. ఆఖరుకు సిరీస్ ను కూడా ఎవరూ ఊహించని విధంగా 2-2తో సమం చేసింది. ఈ సిరీస్ లో ముందే చెప్పినట్లుగా బుమ్రా కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడాడు. అయినప్పటికీ నాలుగో లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఓవరాల్ గా 14 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అందులో రెండు ఫైఫర్ లు ఉండటం విశేషం. తను ఆడని రెండు టెస్టుల్లోనే టీమిండియా గెలుపొందడం విశేషం. మరోవైపు ఈ టూర్ గురించి భారత స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా ఎమోషనల్ గా పోస్టు పెట్టాడు. ఈ టూర్ లో తాను చాలా పొందానని, మరిచి పోలేదని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. కఠినమైన పరిస్థితులకు నిలబడి, జట్టు ప్రదర్శించిన పోరాట పటిమను చూసి తను గర్వ పడుతున్నానని పేర్కొన్నాడు. దేశానికి ప్రాతినిథ్యం వహించడం ఎంతో గర్వపడే విషయమని పంత్ చెప్పుకొచ్చాడు. జట్టు కోసం ఆటగాళ్లంతా ప్రాణం పెట్టి ఆడుతారని గుర్తు చేశాడు. ఈ టూర్ లో తమకు అండగా నిలిచిన సపోర్టు స్టాఫ్ కు , అభిమానులకు థాంక్స్ చెప్పాడు. తమ జట్టు చాలా ఆకలితో ఉందని, ఐకమత్యంతో మరింత క్రికెట్ ను ముందుకు తీసుకుపోవడానికి సిద్దంగా ఉన్నామని పేర్కొంటూ, సిరీస్ కు సంబంధించి కొన్ని ఫోటోలను షేర్ చేశాడు. ఇక నాలుగో టెస్టు వరకు ఆడిన పంత్.. ఆ టెస్టులో పాదం గాయంతో దూరమయ్యాడు. అయినప్పటికీ ఆ టెస్టులో కీలక దశలో బ్యాటింగ్ చేసి, స్ఫూర్తి నింపాడు.

# చీరకట్టు కవిస్తున్న నిత్యశ్రీ




కంచరపాలెం సినిమాలో చూపించిన సంఘటనల్లో ఒక్కటైనా మన జీవితంలోనూ ఎదురై ఉంటుంది. ఇక కంచరపాలెం సినిమాలోని ప్రతి క్యారెక్టర్ ప్రేక్షకులకు బాగా దగ్గరయింది. అలాగే ఈ సినిమాలో నటించిన చైల్డ్ ఆర్టిస్ట్‌లు గుర్తున్నారా..? చక్కటి నటనతో ఆకట్టుకున్నారు అందరూ. పై ఫొటోలో కనిపిస్తున్న చిన్నది కూడా తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. తన క్యూట్ క్యూట్ నటనతో ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది ఆ చిన్నది. పై ఫొటోలకనిపిస్తున్న చిన్నారి పేరు నిత్యా శ్రీ.. కంచెరపాలెం సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది నిత్యా. ఈ సినిమా తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది నిత్యా. మొన్నమధ్య ధనుష్ నటించిన సార్ సినిమాలో కనిపించింది. ఈ చిన్నారి ఇప్పుడు ఎలా ఉందో తెలుసా..? ఈ అమ్మడు చాలా అందంగా మారింది. హీరోయిన్స్ కు ఏమాత్రం తీసిపోని అందంతో ఆకట్టుకుంటుంది నిత్యా. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది. పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటిస్తుంది ఈ చిన్నారి. అలాగే క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇటీవలే ఓ సినిమాలో హీరోయిన్ గా ఎంపికైందని తెలుస్తుంది. తాజాగా ఈ చిన్నదాని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి. తాజాగా నిత్యా చీరకట్టులో కొన్ని ఫోటోలు వదిలింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. చీరకట్టులో వయ్యారాలు ఒలకబోస్తూ క్యూట్ పోజులు ఇచ్చింది. ఈ ఫోటోల పై కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

## సోషల్ మీడియా ట్రోల్స్‌కు స్పందించను : చిరంజీవి



సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్‌పై తాను స్పందించనని తెలిపాడు అగ్రనటుడు చిరంజీవి. ఫీనిక్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్‌కి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు నటుడు చిరంజీవి, తేజ సజ్జా. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ..తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన ఒక జర్నలిస్ట్ వలన వచ్చిందని ఈ విషయంలో అతడికి ఎప్పుడూ రుణపడి ఉంటానని చిరంజీవి అన్నారు.ఈ కార్యక్రమంకి వచ్చి బ్లడ్ డోనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలుముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజసజ్జాకు కూడా బ్లడ్ డోనేట్ చేసినందుకు ధన్యవాదాలు. రక్తదానం పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం.

ఈ సందర్భంగా ఒక విషయం మీతో పంచుకోవాలి అనుకుంటున్నాను. ఎవరో ఒకరు రాజకీయ నాయకుడు కారణం లేకుండా నన్ను విమర్శించడం మొదలుపెట్టాడు. నేను ఇప్పుడూ రాజకీయల్లో కూడా లేను. అయిన కూడా అప్పుడప్పుడు విమర్శలు వస్తునే ఉంటాయి. అయితే ఈ నాయకుడు ఒకరోజు ఎదో ముంపు ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఒక మహిళ అతడిని నిలదీస్తూ.. చిరంజీవిని అలాంటి మాటాలు అనాలని మీకు ఎందుకు అనిపించిందంటూ కడిగి పారేసింది. దీంతో ఆ వీడియో చూసి ఎమోషనల్ అయ్యాను. ఆ తర్వాత ఆమె వివరాలు తెలుసుకోగా.. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిసి నాకు గుండె ఉప్పొగింది. అయితే సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై నేను ఎందుకు స్పందించరంటూ అందరూ నన్ను అడుగుతారు. నేను ఎప్పుడూ స్పందించను.



## ఈడీ విచారణకు హాజరైన విజయ్‌దేవరకొండ

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని నటుడు ప్రకాశ్ రాజ్‌తో పాటు పలువురు నటులకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో గత నెల 30న ప్రకాశ్ రాజ్ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అయితే నేడు విచారణకు రావాలని విజయ్‌కి నోటీసులు జారీ చేయగా.. తాజాగా అతడు ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు పలువురు సినీ సెలబ్రిటీలపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే హీరోలు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండతో పాటు రానా దగ్గుబాటి, నటి మంచు లక్ష్మి వంటి వారికి కూడా ఈడీ నోటీసులు పంపింది. రానా దగ్గుబాటి ఇప్పటికే విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. సినిమా షూటింగ్‌లు ఉండడంతో విచారణకు మరికొంత సమయం కోరాడు.



## పుష్ప-2 తొక్కిసలాటపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమీయర్ షో సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ తొక్కిసలాటలో ఒక మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయంపై అందిన ఫిర్యాదును పరిశీలించిన జాతీయ మానవ హక్కుల కమిషన్, సినిమా థియేటర్ వద్ద తగిన భద్రతా చర్యలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణిస్తూ, మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని అలాగే ఈ సంఘటనపై పూర్తి నివేదికను సమర్పించాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. కాగా.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685